12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్.టి.ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 10 సంచిక : 11 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ బుధవారం 16 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :11 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA WED 16 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# 2029 నాటికి అర్హులందరికీ సొంతిళ్లు..

## గృహ నిర్మాణ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష

- 2027 మార్చి నాటికి 5.52 లక్షల గృహాలు పూర్తి చేయాలని సీఎం ఆదేశం
- ఉచిత ఇళ్ల స్థలాల కోసం పారదర్శక విధానం అమలు చేయాలని సూచన
- కేంద్ర సహకారంతో రాష్ట్రంలో పారిశ్రామిక టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ప్రణాళిక
- కుప్పం నియోజకవర్గంలో సంతృప్త స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్దేశం



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వతమైన గృహాన్ని అందించడమే లక్ష్యమని ముఖ్యమం త్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 'హౌసింగ్ ఫర్ ఆల్' కార్యక్రమాన్ని సాచురేషన్ విధానంలో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని గడువు నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో పాటు ఆ శాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్), పీఎం జన్ మన్ వంటి వివిధ పథకాల కింద చేపట్టాల్సిన ఇళ్ల నిర్మాణ పనులను వచ్చే నెలలోగా గ్రౌండింగ్ చేయాలని ముఖ్య మంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పట్టణ ప్రాంతాల్లో 1.5 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. డిసెంబరు 2026 నాటికి 2.05 లక్షల ఇళ్లు, 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారుల గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు.

రాష్ట్రంలో పీఎంఏవై 1.0, 2.0, పీఎం జన్ మన్ పథకాల కింద మొత్తం 18.72 లక్షల ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 13.20 లక్షలు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ పరిధిలో 16.11 లక్షల ఇళ్లకు గాను 11.31 లక్షలు, ఏపీ టిడ్కో పరిధిలో 2.61 లక్షల ఇళ్లకు గాను 1.88 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు.

- మిగతా 2లో



## మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని

# హఠాన్మరణం

- గుండెపోటుతో ఆళ్ల నాని మృతి
- 1969లో ఏలూరులో జన్మించిన ఆళ్ల నాని
- గత ఏడాది వైసీపీని వీడి టీడీపీలో చేరిన నాని



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఏపీ మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. విశాఖలోని తన నివాసంలో ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు విడిచారు. ఆయన ఆకస్మిక మృతి వార్త ఏలూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వర్గాలను, పార్టీ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

## మాజీ మంత్రి ఆళ్ల నాని మృతిపై సీఎం చంద్రబాబు, మాజీ సీఎం జగన్ తీవ్ర దిగ్భ్రాంతి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని మృతిపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన 56 సంవత్సరాల వయసులోనే గుండెపోటుతో దూరమవ్వడం బాధాకరం అన్నారు. ఆళ్ల నాని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

- మిగతా 2లో



## నేడు నెల్లూరు జిల్లాకు మంత్రి లోకేశ్.. పలు కార్యక్రమాలకు శ్రీకారం

- నెల్లూరు నగరంలో ఆధునికీకరించిన రెండు ప్రభుత్వ పాఠశాలల ప్రారంభోత్సవం
- కోవూరులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న లోకేశ్
- కోవూరు నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం

- మిగతా 2లో



## ధ్వజారోహణంతో మొదలైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు.. పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

- తిరుమలలో బ్రహ్మోత్సవాల శోభ
- ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేసిన వేదపండితులు
- కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేసిన చంద్రబాబు
- రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం

- మిగతా 2లో

## ఏపీలో స్థానిక ఎన్నికలకు వేగంగా అడుగులు.. ఈనెల 22న ఓటర్ల జాబితా

- ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ వేగవంతం
- 41 పట్టణ స్థానిక సంస్థలకు ఓటర్ల జాబితాల రూపకల్పనకు ఆదేశాలు
- ఈ నెల 22న తుది ఓటర్ల జాబితాలను ప్రచురించనున్న ఎన్నికల సంఘం
- 2026 జనవరి 1ని అర్హత తేదీగా నిర్ణయించిన ఎస్ఈసీ
- ఇటీవలే 59 మున్సిపాలిటీలకు కూడా ఇదే తరహా నోటిఫికేషన్ జారీ

- మిగతా 2లో




## ప్రైవేటు కోచింగ్ సెంటర్లపై చంద్రబాబు సీరియస్.. కఠిన చర్యలకు ఆదేశం



- ప్రభుత్వంపై బురద జల్లేందుకు అభ్యర్థులను రెచ్చగొడుతున్నాయని కోచింగ్ సెంటర్లపై ఆరోపణ
- రాజకీయ ప్రయోజనాల కోసమేనని ప్రభుత్వ నిర్ధారణ
- జీవో నెం.9 నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని వెల్లడి
- రాజకీయ కుట్రల్లో భాగస్వాములను చేస్తే సహించేది లేదని స్పష్టీకరణ

- మిగతా 2లో



## అల్లు అర్జున్ మామపై గచ్చిబౌలిలో కేసు నమోదు

- నటుడు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డిపై కేసు
- నానక్‌రామ్‌గూడ భూ వివాదంపై గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు
- గేట్ల తాళాలు పగలగొట్టి చొరబడ్డారని ఆరోపణ
- సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులకు సాక్ష్యంగా అందజేత
- ఉద్యోగులు, నివాసితులకు రక్షణ కల్పించాలని వినతి

- మిగతా 2లో



## 58 యుద్ధాల ప్రభావం 850 కోట్ల మందిపై పడింది: కేఏ పాల్

- నిత్యావసర వస్తువులు, ఇంధన ధరల పెరుగుదలపై పాల్ ఆవేదన
- ఇరాన్ యుద్ధం వల్ల అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నదని వ్యాఖ్య
- ప్రపంచ శాంతి కోసం టైమ్స్ స్క్వేర్ వద్ద ప్రశాంతతా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వెల్లడి

- మిగతా 2లో

## మీ ఫోన్ నుంచి రూ.10 వేలు పంపితే.. 40 రూపాయలు ఛార్జీ పడుతుందా..?

- యూపీఐ పేమెంట్లపై కొత్త ఛార్జీలు.. సామాన్యుడిపై భారం ఎంత?
- పెంచిన ఛార్జీలు మర్చంట్లు చెల్లిస్తారంటున్న కేంద్ర ప్రభుత్వం
- పేమెంట్ సంస్థలు, బ్యాంకుల విధానాలపై ఆధారపడి కస్టమర్ పై కొత్త ఛార్జీలు
- కొత్త ఛార్జీలతో నేరుగా కస్టమర్ పై భారం పడుతుందని ప్రతిపక్షాల ఆందోళన

- మిగతా 2లో



## దేశం నుంచి ఆశించడమే కాదు.. సేవ చేయండి

### జెన్ జెడ్, జెన్ ఆల్ఫాకు నిర్మల సీతారామన్

- దేశం కోసం ఏం చేయగలరో యువత ఆలోచించాలన్న నిర్మలా సీతారామన్
- యువత నాయకత్వం చేపట్టి దేశానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్న కేంద్రమంత్రి
- ప్రపంచ అనిశ్చితిలోనూ భారత్ 7.8 శాతం వృద్ధి సాధించిందని వ్యాఖ్య
- తమిళనాడులో గ్లోబల్ కంపెనీలతో ఉపాధి అవకాశాలు పుష్కలమన్న మంత్రి

- మిగతా 2లో



## మనం ఇంకా సిద్ధం కాలేదు.. ఏఐ అభివృద్ధి వేగాన్ని తగ్గించాలి

### బిల్ గేట్స్ అనూహ్య వ్యాఖ్యలు

- ఏఐ వృద్ధి నియంత్రణ అవసరమని పిలుపునిచ్చిన బిల్ గేట్స్
- ఇంతటి భారీ మార్పుకు మనం సిద్ధంగా లేమని వ్యాఖ్య
- సైబర్ దాడుల ముప్పు పొంచి ఉందని హెచ్చరిక
- ఏఐపై ఆందోళన వ్యక్తం చేసిన ఎలాన్ మస్క్, శామ్ ఆల్ట్‌మన్

- మిగతా 2లో




## మావోయిస్టు డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి లొంగుబాటు

- నిజామాబాద్ సీపీ ముందు లొంగిపోయిన నక్కా సుశీల
- తెలంగాణలో మావోయిస్టులు పూర్తిగా దెబ్బతిన్నారన్న పోలీసు అధికారులు
- మరో ముగ్గురు తెలంగాణ నేతలే అజ్ఞాతంలో ఉన్నారని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:దశాబ్దాలుగా వామపక్ష తీవ్రవాదంలో అత్యంత కీలక పాత్ర పోషించిన సీనియర్ నాయకురాలు, డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి (అలియాస్ లత/లలిత/రేలా /జ్యోతి) లొంగిపోయారు.

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# జనం వస్తున్నారని సంబరపడాలా? మారలేదని బాధపడలా?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ పర్యటనలకు జనం పోటెత్తుతున్నారు. పరామర్శకు వెళ్లినా జనం విపరీతంగా రావడం సహజంగా పార్టీ క్యాడర్ లో జోష్ మరింత పెరగాలి. కానీ భయం మాత్రం వైసీపీ నేతలను, ద్వితీయ శ్రేణి నేతలను మాత్రం వెంటాడుతుంది. వైఎస్ జగన్ గతం కంటే భిన్నంగా లేరు. గతంలో ఎలా ఉన్నారో.. దారుణ ఓటమిని చవి చూసిన తర్వాత కూడా జగన్ తన తీరును మార్చుకోలేదు. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన లోటు పాట్లను జగన్ సరిదిద్దుకునే ప్రయత్నం చేయడం లేదు. సహజంగా ఏ ప్రాంతీయ పార్టీ అధినేత అయినా అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకలా, కోల్పోయిన తర్వాత మరొకలా ఉంటారు. కానీ జగన్ ధోరణి మాత్రం అప్పటికీ, ఇప్పటికీ భిన్నంగా లేదని పార్టీ సీనియర్ నేతలే అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వంపై అసంతృప్తిని...

కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లవుతుంది. ప్రభుత్వంపై కొంత వరకూ అసంతృప్తి ఏర్పడిందన్న భావనలో వైసీపీ నేతలు ఉన్నారు. జగన్ అందించిన సంక్షేమ పథకాలకు, ప్రస్తుత ప్రభుత్వానికి పోలిక పెట్టి చూసుకుని మరీ జగన్ పాలన మెరుగు అని అంటున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ప్రత్యర్థి పార్టీ నేతలు కూడా అదే పరిస్థితుల్లో ఉన్నాయి. తాము జనం వద్దకు వెళ్లినప్పుడు పథకాల గురించి నిలదీస్తుండటంతో ప్రభుత్వంపై అసంతృప్తి మొదలయిందని కూటమి ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. కానీ దానిని సక్రమంగా వైసీపీ తమకు అనుకూలంగా క్యాష్ చేసుకోలేకపోతుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. దీంతో పాటు వరసగా ఇస్తున్న కార్యక్రమాలు కూడా వైసీపీ నేతలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. దీనివల్ల ఆర్థిక భారం మాత్రమే కాకుండా కేసులు నమోదవుతున్నాయంటున్నారు.

పేద, మధ్య తరగతి ప్రజలకు...

ఉదాహరణకు మెగా డీఎస్సీలో అవకతవకలపై ఆందోళనలు చేస్తే సామాన్య యూత్ ను కలుపుకుని పోవాల్సిన వైసీపీ నేతలు తమ కార్యకర్తలకే పరిమితమయ్యారు. దీనివల్ల పార్టీకి అంత హైప్ రావడం లేదు. ప్రధానంగా పేద, మధ్యతరగతి ప్రజలు ధరల మోత, గిట్టుబాటు ధరలు పంటలకు లభించకపోవడం వంటివి చేస్తే జనం నుంచి మద్దతు ఎక్కువగా ఉంటుందన్న అభిప్రాయం సీనియర్ నేతలలో వ్యక్తమవుతుంది. ఈ విషయాన్ని జగన్ కు చెప్పినా నిష్ప్రయోజనమే. ఆయన అజెండా ఆయనకుంది. జగన్ తన అజెండా ప్రకారమే వెళ్లాలనుకుంటారు. తాము చెప్పినా తలూపి ఊ కొడతారు తప్పించి తాము చెప్పిన మాటలను చెవికెక్కించుకోలేరని నేతలు అంటున్నారు. కూటమి కలసి ఉన్నప్పుడు ఓడించడం అంత సులువు కాదని గుర్తించి జగన్ ఇప్పటికైనా తన ధోరణిని మార్చుకోవాలని హితవు పలుకుతున్నారు.

## ధ్వజారోహణంతో మొదలైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు.. పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ రెండు ప్రధాన ఘట్టాలతో తిరుమల గిరులు గోవింద నామస్మరణతో మార్మోగాయి.బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారి సమక్షంలో పండితుల వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేశారు. ఈ ధ్వజారోహణం ద్వారా సకల దేవతలను, అష్టదిక్పాలకులను, సకల జీవరాశులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం సంప్రదాయం. ఈ కార్యక్రమంతో తొమ్మిది రోజుల ఉత్సవాలకు వైభవంగా తెరలేచింది.మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయాన్ని పాటించారు. సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబ సమేతంగా తిరుమలకు చేరుకున్నారు. సీఎం వెంట ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి, కుమారుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, కోడలు నారా బ్రహ్మణి ఉన్నారు.సంప్రదాయ వస్త్రధారణలో ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి, ముందుగా బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత పట్టువస్త్రాలను తలపై ఉంచుకుని, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారికి వస్త్రాలు సమర్పించారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రికి అర్చకస్వాములు వేదాశీర్వచనం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పర్యటనలో చంద్రబాబు వెంట టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇతర నేతలు, అధికారులు ఉన్నాయి. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ కూడా ఈ సందర్భంగా ఆలయంలో కనిపించారు.

## దేశం నుంచి ఆశించడమే కాదు.. సేవ చేయండి

దేశం నుంచి మనం ఏం ఆశించాలనే దానికంటే, దేశానికి మనం ఏం చేయగలమనే అంశంపైనే యువత ప్రధానంగా దృష్టి సారించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పిలుపునిచ్చారు. యువత ఆకాంక్షలను వినడానికి దేశం సిద్ధంగా ఉందని, అయితే అదే సమయంలో వారు తమ పౌర బాధ్యతలను కూడా చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఆమె సూచించారు. మంగళవారం చెన్నైలోని డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. "యువత నాయకత్వం బాధ్యతలు చేపట్టాలి. దేశ హితానికే ప్రథమ ప్రాధాన్యతనివ్వాలి. దేశం సురక్షితంగా, పటిష్ఠంగా ఉన్నప్పుడే మనకు నివసించడానికి ఒక ప్రశాంతమైన ఆవాసం ఉంటుంది. మన మాతృభూమిని ఎన్నటికీ వదులుకోకూడదు" అని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్యంలో నెలకొన్న అశాంతి వంటి ప్రపంచ పరిణామాలను ప్రస్తావిస్తూ, దేశ భద్రత, స్థిరత్వం యొక్క ఆవశ్యకతను ఆమె ఈ సందర్భంగా నొక్కిచెప్పారు.ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకుంటూ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని ఆమె కొనియాడారు. తమిళనాడు రాష్ట్రం పారిశ్రామిక, సాంకేతిక రంగాలలో హబ్‌గా విరాజిల్లుతోందని, ముఖ్యంగా శ్రీపెరంబుదూర్-ఒరగడమ్ కారిడార్ ఆటోమొబైల్, స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల అంతర్జాతీయ కేంద్రంగా నిలుస్తోందని తెలిపారు. కోయంబత్తూరు, మధురై వంటి నగరాల్లోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని ఆమె వివరించారు.ఉద్యోగినులను ప్రోత్సహించేందుకు వీలుగా ప్రతి జిల్లాలో వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేసేందుకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులను కేటాయించినట్లు ఆమె గుర్తుచేశారు. ఈ సందర్భంగా 'తిరుక్కురళ్'లోని సూక్తులను ఉటంకిస్తూ, పట్టభద్రులు అహంకారాన్ని వీడి వినయంతో మెలగాలని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని ఆమె హితవు పలికారు.

## ప్రైవేటు కోచింగ్ సెంటర్లపై చంద్రబాబు సీరియస్.. కఠిన చర్యలకు ఆదేశం

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొడుతున్న ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వంపై బురదజల్లే లక్ష్యంతో విద్యార్థులను ఆందోళనలకు ఉసిగొల్పుతున్నారని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ మేరకు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే సంస్థలపై చట్టప్రకారం ముందుకెళ్లాలని స్పష్టం చేశారు.కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాల యాజమాన్యాలు తమ స్వార్థ, రాజకీయ ప్రయోజనాల కోసం అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. పోటీ పరీక్షల కోసం తమ వద్ద శిక్షణ పొందుతున్న యువతపై ఒత్తిడి తెచ్చి, వారిని రాజకీయ ప్రేరేపిత నిరసనలు, ధర్నాలలో పాల్గొనేలా చేస్తున్నట్లు తేలిందని అధికారులు పేర్కొన్నారు. దురుద్దేశంతోనే అభ్యర్థులను ఈ ఆందోళనల వైపు మళ్లిస్తున్నారని ముఖ్యమంత్రికి వివరించారు.వాస్తవానికి, ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనలు 2026, జీవో నెంబర్ 9 ప్రకారం ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు నిర్దేశిత మార్గదర్శకాలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. అయితే, ఈ నిబంధనలను పక్కనపెట్టి కొన్ని సంస్థలు రాజకీయ కార్యకలాపాలు నడుపుతున్నాయని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో, అభ్యర్థులను రాజకీయ కుట్రల్లోకి లాగాలని చూస్తే కఠిన పరిణామాలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఏ కోచింగ్ సెంటర్‌పైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంలో వెనుకాడేది లేదని స్పష్టం చేసింది.

# 2029 నాటికి అర్హులందరికీ సొంతిల్లు..

**ఉచిత ఇళ్ల స్థలాలపై ప్రత్యేక కార్యాచరణ**

ఇంటి స్థలం లేని అర్హులైన కుటుంబాలను కచ్చితంగా గుర్తించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఆవాస్ ప్లస్, హౌసింగ్, రెవెన్యూ శాఖలతో పాటు ఆర్టీజీఎస్ నుంచి డేటాను అనుసంధానం చేసి, డూప్లికేషన్ లేకుండా లబ్ధిదారులను గుర్తించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రాథమిక జాబితాలు ప్రచురించి, అభ్యంతరాలు స్వీకరించి, పారదర్శకంగా పరిష్కరించిన తర్వాతే తుది జాబితాలను ఖరారు చేయాలని స్పష్టం చేశారు.

ఇప్పటికే ఉన్న లేఅవుట్లలో నిర్మాణాలు చేపట్టని భూమిని అవసరాన్ని బట్టి 2 లేదా 3 సెంట్ల ప్లాట్లుగా పునర్వ్యవస్థీకరించాలని నిర్దేశించారు. కుప్పం నియోజకవర్గంలో సాచురేషన్ విధానంలో గృహ నిర్మాణం చేపట్టాలని ప్రత్యేకంగా ఆదేశించారు.

పారిశ్రామిక టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ప్రణాళిక

రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలను పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో పారిశ్రామిక టౌన్‌షిప్‌లను నిర్మించే అంశంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి గృహ నిర్మాణ శాఖను ఆదేశించారు. శ్రీసిటీ సహా ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లో ఈ టౌన్‌షిప్‌ల ఏర్పాటు ద్వారా ఆర్థిక లావాదేవీలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ)తో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. 2027 డిసెంబరు నాటికి మరో 75 వేల కొత్త గృహాలు మంజూరయ్యేలా, 1.5 లక్షల ఇళ్లను పైప్‌లైన్‌లో ఉంచేలా చూడాలని, ఇందుకు అవసరమైన నిధుల కోసం కేంద్ర గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

## మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని హఠాన్మరణం

- మొదటి పేజి తరువాయి

ఆళ్ల నాని వయసు 56 సంవత్సరాలు. 1969లో ఏలూరులోని శనివారపుపేటలో జన్మించారు.

ఏలూరు సి.ఆర్.రెడ్డి కాలేజీలో ఇంటర్మీడియట్, ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో బీకామ్ పూర్తి చేశారు.కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన ఆళ్ల నాని, 2004లో తొలిసారిగా ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 2009లో కూడా కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2013లో కాంగ్రెస్ కు గుడ్ బై చెప్పి వైసీపీలో చేరారు. 2017లో వైసీపీ తరపున ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2019లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం డిప్యూటీ సీఎంగా.. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలను నిర్వహించారు. గత ఎన్నికల తర్వాత వైసీపీని వీడిన ఆయన 2025 ఏప్రిల్ లో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

ఆళ్ల నాని మృతి పట్ల ఏపీకి చెందిన రాజకీయ నేతలు సంతాపం ప్రకటిస్తున్నారు. ఏలూరులో ఆయన భౌతికకాయాన్ని దర్శించుకునేందుకు అనుచరులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

## మాజీ మంత్రి ఆళ్ల నాని మృతిపై సీఎం చంద్రబాబు, మాజీ సీఎం జగన్ తీవ్ర దిగ్భ్రాంతి

- మొదటి పేజి తరువాయి

ఆళ్ల నాని గారి ఆత్మకు శాంతిని చేకూర్చాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు.

ఆళ్లనాని ఆకస్మిక మృతిపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

ఏపీ మాజీ డిప్యూటీ సీఎం, ఏలూరు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) మృతిపట్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన మృతి తనను కలచివేసిందన్నారు. మాజీ మంత్రి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ కష్టకాలంలో వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాల్సిందిగా దేవుణ్ని ప్రార్థించారు. వైసీపీ హయాంలో ఉప ముఖ్యమంత్రిగా, వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఆళ్లనాని చేసిన సేవల్ని గుర్తుచేసుకున్నారు.

**వివాదాలకు దూరంగా ఉండే మంచి నేత: నారా లోకేష్**

టీడీపీ నేత, మాజీ మంత్రి ఆళ్ల నాని గుండెపోటుతో మృతి చెందారని తెలియడంతో మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఎప్పుడూ వివాదాలకు దూరంగా, అందరితోనూ స్నేహపూర్వకంగా మెలిగే ఆళ్ల నానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

**ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూరాలి: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

మాజీ డిప్యూటీ సీఎం, ఏలూరుకు చెందిన సీనియర్ రాజకీయ నాయకులు ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) హఠాన్మరణం తనను ఎంతో బాధించిందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. 3 సార్లు ఏలూరు శాసనసభ్యునిగా, ఒకసారి ఎమ్మెల్సీగా ప్రజలకు సేవలు అందించిన వ్యక్తి ఆళ్ల నాని. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించిన పవన్ కళ్యాణ్.. ఆళ్ల నాని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## అల్లు అర్జున్ మామపై గచ్చిబౌలిలో కేసు నమోదు

ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డిపై హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నగరంలోని ఐటీ కారిడార్ పరిధిలోని నానక్‌రామ్‌గూడలో గల ఒక భూవివాదానికి సంబంధించి ఆయనపై క్రిమినల్ ఫిర్యాదు దాఖలైంది.నానక్‌రామ్‌గూడలోని 'మంత్రి కాస్మోస్' ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. చంద్రశేఖర్ రెడ్డి మరికొందరితో కలిసి తమ భవన ప్రాంగణంలోకి అక్రమంగా ప్రవేశించారని వారు ఆరోపించారు. గేట్ల తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడటమే కాకుండా, అడ్డుకోబోయిన సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్, ఫొటోలను ఒక పెన్ డ్రైవ్‌లో నిక్షిప్తం చేసి, గచ్చిబౌలి పోలీసులకు సాక్ష్యంగా అందజేశారు. చంద్రశేఖర్ రెడ్డితో

పాటు ఆయన అనుచరులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు.అంతేకాకుండా, ఈ ఫిర్యాదు ప్రతులను తెలంగాణ డీజీపీ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, మాదాపూర్ డీసీపీ, గచ్చిబౌలి ఏసీపీలకు సైతం పంపారు. ఐటీ కారిడార్‌లోని తమ ఉద్యోగులకు, నివాసితులకు రక్షణ కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## మావోయిస్టు డివిజన్ కమిటీ సభ్యురాలు నక్కా సుశీల రాణి లొంగుబాటు

- మొదటి పేజి తరువాయి

నిజామాబాద్ సీపీ సాయిచైతన్య ఎదుట ఆమె మంగళవారం అధికారికంగా లొంగిపోయారు. సుశీల సరెండర్‌తో మావోయిస్టుల పునర్నిర్మాణ సామర్థ్యం పూర్తిగా దెబ్బతిన్నదని, ఇది రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద పతనానికి ముగింపు దశగా నిలిచిందని పోలీసులు అభివర్ణించారు.ఈ చారిత్రాత్మక పరిణామంతో 2026 సంవత్సరం తెలంగాణ పోలీసు శాఖ పోరాటంలో ఒక కీలక మలుపుగా మారింది. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ), గ్రేహౌండ్స్, జిల్లా పోలీసుల సమన్వయంతో సాగించిన వ్యూహాత్మక చర్యల వల్ల ఈ ఏడాది ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో మొత్తం 266 మంది అజ్ఞాత మావోలు హింసామార్గాన్ని వీడి లొంగిపోయారు.

ఈ ఏడాది లొంగిపోయిన వారిలో ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు, 12 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, 25 మంది డివిజనల్ కమిటీ కార్యదర్శులు/సభ్యులు ఉన్నారని పోలీసులు తెలిపారు. వీరితో పాటు 94 మంది ఏరియా కమిటీ సభ్యులు, 131 మంది సాధారణ మావోయిస్టులు లొంగిపోవడంతో పార్టీ నెట్‌వర్క్ అగ్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు పూర్తిగా ఛిన్నాభిన్నమైందని వెల్లడించారు.ప్రస్తుతం తెలంగాణకు చెంది బయటి రాష్ట్రాల్లో పనిచేస్తున్న ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు (గణపతి), జడె రత్నబాయి (సుజాత), వార్త శేఖర్ (మంగు) అనే ముగ్గురు నేతలు మాత్రమే అజ్ఞాతంలో మిగిలారని పోలీసులు ధ్రువీకరించారు. సుశీల రాణి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ పూర్తిగా బలహీన పడిందని... అజ్ఞాతంలో ఉన్న మిగిలిన వారందరూ తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న లొంగుబాటు, పునరావాస విధానాన్ని ఉపయోగించుకుని సాధారణ జనజీవన స్రవంతిలో కలవాలని పోలీసు శాఖ విజ్ఞప్తి చేసింది.

## మీ ఫోన్ నుంచి రూ.10 వేలు పంపితే.. 40 రూపాయలు ఛార్జీ పడుతుందా..?

యూపీఐ పేమెంట్లపై కొత్త ఛార్జీలను ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. రూ.2వేలకు పైబడి చెల్లింపులపై 100కి 40 పైసలు వసూలు చేయనున్నారు. ఈ ఛార్జీలను మర్చంట్ల నుంచి వసూలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. కస్టమర్ నుంచి వసూలు చేయాలా వద్దా అన్నది సంబంధిత చెల్లింపుల సంస్థలు, బ్యాంకుల విధానాలపై ఆధారపడి ఉంటుంది కాబట్టి యూపీఐ పేమెంట్లపై కొత్త ఛార్జీల భారం నేరుగా ప్రజలపై పడే అవకాశం ఉందని పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

మంగళవారం సెప్టెంబర్ 15న సమావేశమైన యూపీఐ స్టీరింగ్ కమిటీ.. రూ. 2వేలకు పైబడిన లావాదేవీలకు యూపీఐ ఎండీఆర్‌ను 40 బీపీఎస్‌గా నిర్ణయించిన క్రమంలో యూపీఐ యాప్‌ల ద్వారా పెద్ద మొత్తాల్లో చెల్లింపులు చేసే ప్రజలపై అదనపు భారం పడే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది. ఈ ఎండీఆర్ సాధారణంగా మర్చంట్ నుంచి వసూలు చేసే కమీషన్ కాగా, కస్టమర్ నుంచి నేరుగా వసూలు చేయాలా లేదా అన్నది సంబంధిత చెల్లింపు సంస్థలు, బ్యాంకుల విధానాలపై ఆధారపడి ఉంటుంది.40 బీపీఎస్ అంటే ప్రతి రూ.100కి 40 పైసలు. ఉదాహరణకు రూ.2వేల500 చెల్లింపుపై ఎండీఆర్ రూ.10, రూ.5వేలపై రూ.20, రూ.10వేలపైన రూ.40, రూ.25వేలపై రూ.100 అవుతుంది. ఒకవేళ ఈ ఛార్జీని పూర్తిగా వినియోగదారుడిపైనే బదిలీ చేస్తే, పెద్ద మొత్తాల డిజిటల్ చెల్లింపులు చేసే వారికి ఖర్చు పెరుగుతుంది. ఇదిలా ఉంటే.. రూ.2వేల వరకు యూపీఐ చెల్లింపులకు ఎలాంటి ఛార్జీ ఉండదని ప్రభుత్వం చెబుతోంది. దీంతో రోజువారీ చిన్న మొత్తాల చెల్లింపులు చేసే ప్రజలపై ప్రత్యక్ష ప్రభావం తక్కువగానే ఉంటుందని అంటోంది. కానీ రూ.2వేలకు పైబడిన షాపింగ్, బిల్లులు, ఫీజులు, సేవల చెల్లింపుల సమయంలో అదనపు ఛార్జీ విధిస్తే వినియోగదారులపై పెద్ద ఎత్తున భారం పెరిగే అవకాశం ఎక్కువగానే ఉంది.ప్రస్తుతం ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి యూపీఐ యాప్‌లు బ్యాంకులతో కలిసి సేవలు అందిస్తున్నాయి. సుమారు 40 బేసిస్ పాయింట్ల ఎండీఆర్‌తో ఈ వ్యవస్థకు ఏటా రూ. 16వేల కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. ఎండీఆర్ ద్వారా వచ్చే ఆదాయం ఎన్‌పీసీఐ, బ్యాంకులు, పీఎస్‌పీలు, పేమెంట్ అగ్రిగేటర్లకు పంపిణీ అవుతుంది. ఈ క్రమంలో 40 బీపీఎస్ ఎండీఆర్‌ను వ్యాపారులు భరిస్తారా? లేక చివరికి వినియోగదారులపై ఛార్జీ రూపంలో పడుతుందా? అనేది యూపీఐ వినియోగదారులపై ప్రభావాన్ని నిర్ణయించనుంది.

## 58 యుద్ధాల ప్రభావం 850 కోట్ల మందిపై పడింది: కేఏ పాల్

ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న యుద్ధాల కారణంగా నిత్యావసర వస్తువులు, ఇంధన ధరలు నియంత్రణ లేకుండా పెరిగిపోతుండటంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ప్రపంచంలో జరిగిన వివిధ 58 యుద్ధాల ప్రభావం దాదాపు 200 దేశాలలోని 850 కోట్ల మంది ప్రజలపై తీవ్రంగా పడిందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ ఏడాది ఫిబ్రవరి చివరి నుంచి ప్రారంభమై ఆరు నెలలుగా కొనసాగుతున్న అమెరికా - ఇరాన్ సైనిక ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ దెబ్బతిని, సామాన్యుడికి నిత్యావసరాలు అందని ద్రాక్షగా మారాయని అన్నారు.మార్కెట్లో రూ. 100 ఉండే వస్తువుల ధరలు రూ. 200 నుండి రూ. 300 వరకు పెరిగాయని, లీటర్ పెట్రోల్, గ్యాస్ ధరలు 2 డాలర్ల నుండి ఏకంగా 4 నుండి 5 డాలర్లకు పైగా భారమయ్యాయని లెక్కలతో వివరించారు. ధనిక వర్గాలకు దీనివల్ల పెద్దగా ఇబ్బంది లేకపోయినప్పటికీ, సమాజంలో ఉన్న 90 శాతం పేద, మధ్యతరగతి ప్రజలు ఈ ద్రవ్యోల్బణంతో అల్లాడిపోతున్నారని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొంటేనే ధరల నియంత్రణ సాధ్యమవుతుందని స్పష్టం చేసిన కేఏ పాల్, గ్లోబల్ పీస్ సాధన కోసం రాబోయే సెప్టెంబర్ 28న వాషింగ్టన్ డీసీలోని టైమ్స్ స్క్వేర్ వద్ద ప్రత్యేక ప్రశాంతతా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## మనం ఇంకా సిద్ధం కాలేదు.. ఏఐ అభివృద్ధి వేగాన్ని తగ్గించాలి

సమానత్వం కోసం ఏఐపై 1 బిలియన్ డాలర్లు కేటాయించిన గేట్స్ ఫౌండేషన్‌టెక్నాలజీ రంగంలో ఎల్లప్పుడూ అగ్రగామిగా నిలిచే మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అభివృద్ధిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఏఐ' పురోగతి వేగాన్ని కొంతమేర తగ్గించాల్సిన అవసరం ఉందని, ఈ సాంకేతికత తీసుకురాబోయే భారీ మార్పులను ఎదుర్కొనేందుకు ప్రపంచం ఇంకా సిద్ధంగా లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక అంశాలను పంచుకున్నారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది గతంలోని పర్సనల్ కంప్యూటర్లు లేదా ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణల కంటే భిన్నమైనదని, ఇది సమాజంలో లోతైన మార్పులకు కారణమవుతుందని బిల్ గేట్స్ వివరించారు. "ఇంత వేగవంతమైన, విస్తృతమైన మార్పులకు మనం ఇంకా సంసిద్ధం కాలేదు. నిరంతరం ఆవిష్కరణలను ప్రోత్సహించే నేనే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆశ్చర్యంగా అనిపించవచ్చు" అని ఆయన పేర్కొన్నారు. సమీప భవిష్యత్తులో ఏఐ ఆధారిత సైబర్ దాడుల రూపంలో పెను ముప్పు పొంచి ఉందని ఆయన హెచ్చరించారు. ఈ క్రమంలోనే, స్వయంప్రతిపత్తి కలిగిన ఏఐ మోడల్స్ నియంత్రణ కోల్పోయినట్లు వార్తలు వచ్చిన 'హగ్గింగ్ ఫేస్ ఘటన'ను ఆయన ప్రస్తావించారు.ఇటీవల టెస్లా అధినేత ఎలాన్ మస్క్, ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ వంటి టెక్ దిగ్గజాలు సైతం ఏఐ అభివృద్ధి వేగం పట్ల ఇటువంటి ఆందోళనలనే వ్యక్తం చేశారు. ఇప్పుడు బిల్ గేట్స్ కూడా వారి వాదనతో ఏకీభవించడం ప్రాధాన్యత సంతరించుకుంది.మరోవైపు, ఏఐ వల్ల అనేక ప్రయోజనాలు కూడా ఉన్నాయని గేట్స్ ఫౌండేషన్ విశ్వసిస్తోంది. తమ 'గోల్‌కీపర్స్ రిపోర్ట్'లో పేర్కొన్నట్లుగా, ఏఐని సరైన మార్గంలో నడిపిస్తే, అది సామాజిక సమానత్వాన్ని పెంపొందించే శక్తివంతమైన సాధనంగా మారుతుందని వెల్లడించింది. ఈ దిశగా, సమానత్వంతో కూడిన ఏఐ అభివృద్ధి కోసం తమ ఫౌండేషన్ 1 బిలియన్ డాలర్లను కేటాయించినట్లు స్పష్టం చేసింది.

## నేడు నెల్లూరు జిల్లాకు మంత్రి లోకేశ్.. పలు కార్యక్రమాలకు శ్రీకారం

రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ నేడు (సెప్టెంబర్ 16) నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఒకే రోజు రెండు నియోజకవర్గాల్లో ఆయన పలు అభివృద్ధి, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇందుకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ వివరాలు విడుదలయ్యాయి.

పర్యటనలో భాగంగా తొలుత ఉదయం నెల్లూరు సిటీ నియోజకవర్గానికి చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు స్టోన్ హౌస్ పేటలోని ఆర్ఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాల ఆధునీకరణ పనులను, 11:10 గంటలకు మూలపేటలోని డీఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటించే అవకాశం ఉంది.

మధ్యాహ్నం కోవూరు నియోజకవర్గంలో పర్యటన కొనసాగుతుంది. 12:15 గంటలకు కోవూరు పట్టణంలోని నెల్లూరు బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు.

అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చెన్నై-విజయవాడ హైవే వద్ద ఏర్పాటు చేసిన వేదికపై కోవూరు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నాయకులతో జరిగే సమన్వయ సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేస్తారు. ఈ పర్యటనకు సంబంధించి స్థానిక టీడీపీ నేతలు ఏర్పాట్లు పూర్తి చేశారు.

## ఏపీలో స్థానిక ఎన్నికలకు వేగంగా అడుగులు.. ఈనెల 22న ఓటర్ల జాబితా

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తును వేగవంతం చేసింది. మున్సిపల్ ఎన్నికలను పూర్తి చేసే దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తాజాగా 41 పట్టణ స్థానిక సంస్థలకు ఫోటో ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది.ఈ నోటిఫికేషన్ పరిధిలో రాష్ట్రంలోని 12 మున్సిపల్ కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీలు మరియు నగర్ పంచాయతీలు ఉన్నాయి. ఈ సంస్థలన్నింటికీ ఓటర్ల జాబితాలను రూపొందించే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఎస్ఈసీ ఆదేశించింది. అసెంబ్లీ ఎన్నికల కోసం రూపొందించిన తాజా ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుని ఈ జాబితాలను తయారు చేయనున్నారు.

2026 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా (ఉఖ్యుశ్రీఅటఎఅఅస్త్ర ఇఫ్వ) ఎస్ఈసీ నిర్ణయించింది. ఈ తేదీ నాటికి ఓటు హక్కు పొందిన వారి పేర్లతో జాబితాలను సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియను పూర్తి చేసి, తుది ఓటర్ల జాబితాలను ఈ నెల 22న ప్రచురించనున్నట్లు ఎన్నికల సంఘం తన నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొంది.ఇటీవలే మరో 59 మున్సిపాలిటీలలో ఓటర్ల జాబితాల తయారీకి కూడా ఎస్ఈసీ ఇదే తరహాలో నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా నోటిఫికేషన్‌తో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ మరింత వేగం పుంజుకుంది. వరుస నోటిఫికేషన్ల నేపథ్యంలో త్వరలోనే రాష్ట్రంలో పురపాలక ఎన్నికల నగారా మోగనుందని స్పష్టమవుతోంది.

# సేవా సంకల్ప అభియాన్‌లో ప్రతి ఇంటా దీపం వెలిగించాలి



**కాజులూరు, పెన్‌పవర్, సెప్టెంబర్ 15:** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ పార్టీ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెలరోజుల పాటు 'సేవా సంకల్ప అభియాన్' నిర్వహిస్తున్నట్లు రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్, తాళ్లరేవు మండల ఇన్‌చార్జి దూడల శంకరనారాయణ తెలిపారు. కాజులూరు మండలం దుగ్గుదుర్రులో పోలింగ్ బూత్ అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ 25 ఏళ్ల ప్రజాసేవకు కృతజ్ఞతగా 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలనే సంకల్పానికి ప్రతీకగా సెప్టెంబర్ 17న రాత్రి ప్రతి కుటుంబం తమ ఇంటి ముందు ఒక దీపం వెలిగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలింగ్ బూత్ అధ్యక్షులు సింగన శ్రీనివాసు, పంపన రాంబాబు, రొక్కాల సత్తిబాబు, దూనబోయిన శ్రీనివాసు, నందూరి కామేశ్వరరావు, పాట్నీడి సత్తిబాబు పాల్గొన్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# అంతా మాయం..!






- కొండను పీక్కు తింటున్న మట్టి మాఫియా?
- 202/3 సర్వే నెంబర్లో
- 226 ఎకరాల కొండ యథేచ్ఛగా తవ్వకాలు..! అనుమతులపై అనేక ప్రశ్నలు
- 7 ప్రోక్లైన్ మిషన్లు సీజ్.. కేసు నమోదు
- తనిఖీలు జరుగుతున్నా.. ఆ తర్వాత మళ్లీ తవ్వకాలు జరుగుతున్నాయన్న గ్రామస్థుల ఆరోపణలు
- "అధికారులకు తెలియకుండానే ఇంత పెద్ద స్థాయిలో తవ్వకాలు సాధ్యమా?" --- స్థానికుల ప్రశ్న

**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 15:** ఒకప్పుడు కొండలు.. ఇప్పుడు అక్కడక్కడా మిగిలిన మట్టి దిబ్బలు..! తరతరాలకు ప్రకృతి అందించిన కొండ ప్రాంతం నేడు భారీ యంత్రాల తవ్వకాలతో రూపురేఖలు కోల్పోతున్నదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు ఉన్నాయా? లేక నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయా? అనే ప్రశ్నలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని రామేశ్వరంపేట ప్రాంతంలో ఉన్న గెద్దల కొండ ప్రాంతంలో సుమారు 226 ఎకరాల మేర కొండ భూముల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. భారీ ప్రోక్లైన్ యంత్రాలతో తవ్వకాలు చేసి మట్టిని తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

**కొండలున్నాయన్న చరిత్ర మాత్రమే మిగిలేనా?**

స్థానికుల కథనం ప్రకారం ఈ ప్రాంతంలో ఒకప్పుడు పెద్ద ఎత్తున కొండలు కనిపించేవి. ప్రస్తుతం వాటి ఆకారం, ఎత్తు, విస్తీర్ణం గణనీయంగా మారిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ప్రాంతంలోని సహజ కొండలు భారీగా తొలగిపోతే భవిష్యత్తులో భూగర్భ జలాలు, వర్షపు నీటి ప్రవాహం, నేల కోత, పర్యావరణ సమతుల్యత వంటి అంశాలపై ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "రేపటి తరానికి ఇక్కడ కొండలు ఉండేవని చెప్పుకోవాల్సిన పరిస్థితి వస్తుందేమో" అని కొందరు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అనుమతులు ఎవరిచ్చారు?**

కొండ ప్రాంతాల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలకు సంబంధించి సంబంధిత శాఖల అనుమతులు, భూవినియోగ నిబంధనలు, మైనింగ్ నిబంధనలు తదితర అంశాలు కీలకం.

అయితే రామేశ్వరంపేట ప్రాంతంలో జరుగుతున్న తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఉన్నాయి? ఉంటే వాటి పరిధి ఎంత? అనుమతించిన పరిమాణం కంటే ఎక్కువగా తవ్వకాలు జరిగాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం విస్తీర్ణం, తవ్విన మట్టి పరిమాణం, తరలించిన వాహనాల సంఖ్య, రవాణా చేసిన గ్రావెల్‌కు సంబంధించిన పత్రాలు తదితర అంశాలపై సమగ్ర పరిశీలన అవసరమని స్థానికులు కోరుతున్నారు.

**ఏడు ప్రోక్లైన్ మిషన్లు సీజ్.. కేసు నమోదు**

డీడీ మైన్స్ శ్రీ బి. అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మైన్స్ శాఖ సాంకేతిక సిబ్బంది సత్యతేజ, రవీంద్రలు తనిఖీలు నిర్వహించి ఏడు ఎక్స్కవేటర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్వాధీనం చేసుకున్న ఎక్స్కవేటర్లను తదుపరి చర్యల నిమిత్తం రెవెన్యూ శాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

మంగళవారం సంబంధిత అధికారులు ఈ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు.

ఈ తనిఖీల్లో ఏడు ప్రోక్లైన్ యంత్రాలను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించినట్లు తెలుస్తోంది. భారీ యంత్రాలు ఉపయోగించి తవ్వకాలు జరుగుతున్నాయని అధికారులు గుర్తించి చర్యలు తీసుకున్నట్లయితే, ఇంతకాలం ఈ స్థాయిలో తవ్వకాలు ఎలా కొనసాగాయన్న ప్రశ్న కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**తనిఖీలు వచ్చినప్పుడు ఆగిపోతాయి.. వెళ్లగానే మళ్లీ మొదలవుతాయా?**

ఇదే అంశంపై స్థానికులు మరో తీవ్ర ఆరోపణ చేస్తున్నారు. తమ ప్రాంతానికి గతంలో కూడా విజిలెన్స్, మైనింగ్ తదితర శాఖల అధికారులు వచ్చి తనిఖీలు నిర్వహించారని, అధికారులు వెళ్లిపోయిన తర్వాత కొంతకాలానికి మళ్లీ తవ్వకాలు కొనసాగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి గతంలో నమోదైన కేసులు, సీజ్ చేసిన యంత్రాలు, జరిమానాలు, తవ్వకాలకు సంబంధించిన అనుమతులు, తదుపరి తీసుకున్న చర్యలు వంటి వివరాలను అధికారులు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది.

## పెన్ పవర్ ప్రశ్నిస్తోంది..

కొండ మాయమవుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు?
భారీ యంత్రాలు తిరుగుతుంటే నిఘా వ్యవస్థ ఎక్కడుంది?
తనిఖీల తర్వాత మళ్లీ తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై విచారణ ఎందుకు జరగడం లేదు?
ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరిగిందా?
పర్యావరణానికి జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారు?
ప్రస్తుతం ఏడు ప్రోక్లైన్ యంత్రాల సీజ్, కేసు నమోదుతో అధికారులు చర్యలు ప్రారంభించిన నేపథ్యంలో ఈసారి దర్యాప్తు ఎంత లోతుగా సాగుతుంది? అసలు తవ్వకాల వెనుక ఉన్న వ్యవస్థ ఏమిటి? అన్నది తేలాల్సి ఉంది.
గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఫిర్యాదులు వెళుతున్న కొండను కాపాడుతారా..?
లేక "ఒకప్పుడు ఇక్కడ కొండలు ఉండేవి" అని భావితరాలు చెప్పుకునే పరిస్థితినే మిగులుస్తారా..? అన్నది ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం, జిల్లా అధికారులే చెప్పాలి..?

వివరాలు 4లో..

# ఫొటోలు, వీడియోల కోసం హత్య

- గిరిధర్‌ను హతమార్చిన ఇద్దరు నిందితులు అరెస్ట్
- సీసీటీవీ, సాంకేతిక ఆధారాలతో కేసును ఛేదించిన పోలీసులు
- హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు మరకల దుస్తులు, సెల్‌ఫోన్లు స్వాధీనం

**కాకినాడ, పెన్‌పవర్, సెప్టెంబర్ 15:** అసభ్యకరమైన ఫొటోలు, వీడియోలను తీసుకుని వాటితో మహిళల కుటుంబ సభ్యులను బెదిరించి డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో కాకినాడలో గండి గిరిధర్‌ను హత్య చేసిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, ప్రత్యక్ష, పరోక్ష సాక్ష్యాలను విశ్లేషించి నిందితులను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

కాకినాడ 3 టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరా కాలనీ, సెవెన్ హిల్స్ రోడ్డులో నివాసం ఉంటున్న గండి గిరిధర్ సెప్టెంబర్ 2న తన ఇంట్లో హత్యకు గురయ్యాడు. మృతుడి తల్లి గండి జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 3 టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.వి.ఎస్. సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**ఎస్పీ పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు**

కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ కేసును ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ నిందితులను త్వరితగతిన గుర్తించి అరెస్ట్ చేయాలని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు కాకినాడ ఇన్‌చార్జ్ సబ్‌డివిజనల్ పోలీస్ ఆఫీసర్, జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) డా. మహంతి కిషోర్ కుమార్ పర్యవేక్షణలో ××× టౌన్ ఇన్‌స్పెక్టర్ కె.వి.ఎస్. సత్యనారాయణ ప్రత్యేక క్రైమ్ బృందాలను ఏర్పాటు చేశారు. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, సంఘటనకు సంబంధించిన ఇతర ఆధారాలను వివిధ కోణాల్లో విశ్లేషించిన పోలీసులు నిందితులను గుర్తించారు.

**ఫొటోలు, వీడియోల కోసం పథకం**

దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం గిరిధర్‌కు గతంలో వివాహం కాగా, భార్యతో విభేదాల కారణంగా విడాకులు తీసుకుని ప్రస్తుతం తల్లితో కలిసి నివసిస్తున్నాడు. తనకు పరిచయం ఉన్న కొంతమంది మహిళలకు సంబంధించిన అసభ్యకరమైన ఫొటోలు, వీడియోలను అతను తన సెల్‌ఫోన్‌లో భద్రపరచుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గిరిధర్‌తో సన్నిహితంగా ఉండే పాలేపు వివేక్ ఏ బన్నీ, ఏలూరి రామకృష్ణ ఏ పావలాలకు ఆ ఫొటోలు, వీడియోలను చూపించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిందితులు వాటిని గిరిధర్ వద్ద నుంచి తీసుకుని, అందులో ఉన్న మహిళల కుటుంబ సభ్యులను బెదిరించి డబ్బులు సంపాదించవచ్చని భావించినట్లు పోలీసులు తెలిపారు.

**ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో దాడి**

గిరిధర్ తల్లి, పక్క పోర్షన్‌లో నివసించే అతని అన్నయ్య, కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో గిరిధర్ ఒక్కడే ఉన్నాడని తెలుసుకున్న నిందితులు సెప్టెంబర్ 1న రాత్రి సుమారు 12.15 గంటలకు అతని ఇంటికి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఫొటోలు, వీడియోల విషయమై గిరిధర్‌తో గొడవకు దిగిన నిందితులు ముందుగానే తీసుకెళ్లిన కత్తితో అతని కంఠం, భుజంపై దాడి చేసినట్లు వెల్లడించారు.

తీవ్ర రక్తస్రావం కావడంతో గిరిధర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారైనట్లు పేర్కొన్నారు.

**12న ఇద్దరి అరెస్ట్**

దర్యాప్తులో సేకరించిన ప్రత్యక్ష, పరోక్ష సాక్ష్యాలు, సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ తదితరాలను సమగ్రంగా విశ్లేషించిన పోలీసులు నిందితుల ప్రమేయాన్ని నిర్ధారించారు. దీంతో సెప్టెంబర్ 12న ఇద్దరినీ అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో కాకినాడ అర్బన్ ఇందిరా కాలనీ, సాంబమూర్తినగర్‌కు చెందిన పాలేపు వివేక్ ఏ బన్నీ (18), అయోధ్యనగర్‌కు చెందిన ఏలూరి రామకృష్ణ (21) ఉన్నారు.



**కత్తి, సెల్‌ఫోన్లు స్వాధీనం**

నిందితుల వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, హత్య సమయంలో వారు ధరించిన రక్తపు మరకలతో కూడిన దుస్తులు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక పెన్‌డ్రైవ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హత్య అనంతరం మృతుడి వద్ద నుంచి తీసుకెళ్లిన సెల్‌ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వస్తువులను శాస్త్రీయ పరీక్షలు, తదుపరి చట్టపరమైన చర్యల కోసం భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. కేసులో మరిన్ని సాక్ష్యాధారాల సేకరణ, సాంకేతిక ఆధారాల విశ్లేషణ తదితర అంశాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

**దర్యాప్తు బృందానికి ఎస్పీ అభినందనలు**

కేసును సవాలుగా తీసుకుని త్వరితగతిన దర్యాప్తు చేసి నిందితులను గుర్తించి అరెస్ట్ చేసిన ××× టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.వి.ఎస్. సత్యనారాయణ, ఎస్ఐలు జి.వి.వి.ఎస్. చౌదరి, వి. ఆంజనేయరాజు, హెడ్ కానిస్టేబుల్ సతీష్, కానిస్టేబుల్ మురళీరాజు, క్రైమ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ అభినందించారు.

# పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల అకాడమిక్ ప్రగతిపై ప్రత్యేక దృష్టి






**2027 పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలే లక్ష్యం**

**డిసెంబర్ నాటికి 'మనబడి--మన భవిష్యత్తు' పనులు పూర్తి చేయాలి**

**పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి**

**కాకినాడ, పెన్‌పవర్, సెప్టెంబర్ 15:** పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల అకాడమిక్ ఫలితాలను మెరుగుపరిచేందుకు ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. 2027 పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఇప్పటి నుంచే కార్యాచరణ చేపట్టాలని సూచించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో పాఠశాల విద్యాశాఖ, నెట్‌జీరో--హెల్దీ క్యాంపస్, జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యత, ఎన్రోల్మెంట్, అకాడమిక్ ఫలితాలు, నెట్‌జీరో--హెల్దీ క్యాంపస్ అమలు తదితర అంశాలపై సమీక్షించారు.

**మధ్యాహ్న భోజన వినియోగం 95 శాతానికి తగ్గకూడదు**

జిల్లాలో విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వినియోగంలో కొన్ని మండలాలు వెనుకబడి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలంలోనూ వచ్చే నెల నాటికి మధ్యాహ్న భోజన వినియోగం 95 శాతానికి తగ్గకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని కూడా మరింత పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచాలని తెలిపారు.

**వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ**

విద్యార్థుల అకాడమిక్ ప్రమాణాలను పెంచేందుకు ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా తొమ్మిదో తరగతి విద్యార్థుల్లో 60 శాతానికి పైగా మార్కులు సాధించేలా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. గతంలో తక్కువ ఫలితాలు సాధించిన పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల బోధనా విధానాలను ఎంఈఓలు స్వయంగా పరిశీలించాలని సూచించారు.

పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, స్లిప్ టెస్ట్‌లను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. 2027 పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా పాఠశాలల వారీగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

**డిసెంబర్ నాటికి 'మనబడి--మన భవిష్యత్తు' పనులు పూర్తి**

పాఠశాలల్లో చేపట్టిన 'మనబడి--మన భవిష్యత్తు' రెండో విడత పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుద్దీకరణ, మేజర్, మైనర్ మరమ్మతులు, పెయింటింగ్ తదితర ఐదు కాంపోనెంట్ల పనులను డిసెంబర్ నెలాఖరుకు 100 శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇంజినీరింగ్ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి బిల్లుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

**29న పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు**

పాఠశాల యాజమాన్య కమిటీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 18న ఓటర్ల జాబితాను ప్రదర్శించాలని, 25న అభ్యంతరాలను పరిష్కరించి తుది జాబితాను ప్రచురించాలని తెలిపారు. సెప్టెంబర్ 29న ఎన్నికలు నిర్వహించి, ఎంపికైన చైర్మన్, సభ్యులతో మధ్యాహ్నం 3 గంటలకు తొలి సమావేశం నిర్వహించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియను పాఠశాల స్థాయికే పరిమితం చేసి, సజావుగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.

**నెట్‌జీరో--హెల్దీ క్యాంపస్‌కు ప్రాధాన్యత**

పాఠశాలలతో పాటు సంక్షేమ వసతి గృహాల్లో నెట్‌జీరో--హెల్దీ క్యాంపస్ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆరోగ్యకరమైన క్యాంపస్‌లుగా తీర్చిదిద్దేందుకు గుర్తించిన పాఠశాలలు, వసతి గృహాల్లో అవెన్యూ ప్లాంటేషన్, మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలని సూచించారు. మొక్కల పెంపకానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి పి. రమేష్, సమగ్ర శిక్ష ఏపీఓ వీవీవీ. లక్ష్మణరావు, డ్వామా పీడీ మధుసూదన్, డీఐఈఓ జె. రాంబాబు, సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి జేడీ ఎ. శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ అధికారి శ్యామలకుమారి, గురుకుల పాఠశాల సమన్వయకర్త రాజకుమారి, ఇతర సంక్షేమ శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జగ్గంపేటలో ఘనంగా వినాయక చవితి



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 15:** జగ్గంపేటలో వినాయక చవితి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల గ్రామాల్లో వాడవాడల గణనాథులను ప్రతిష్టించి నవరాత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ జేవియర్ అపార్ట్మెంట్, పద్మనాభ నగర్, గెద్దపేట, చెరువుగట్టు, శెట్టిబలిజిపేట, మర్రిమొక్క వీధి, రత్నాలపేట, గొల్లపేట, మార్కెట్ వీధి, మెయిన్ రోడ్డు, జయ హాస్పిటల్, అంబేద్కర్ కాలనీ, టాక్సీ స్టాండ్, మినీ గూడ్స్ వ్యాన్ స్టాండ్, జ్యోతుల కాలనీ, శ్రీరామ్ నగర్, నిలకుండీలపేట తదితర ప్రాంతాల్లోని అన్ని మండపాలను తిరిగి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ విఘ్నాలకు అధిపతి అయిన వినాయకుడి ఆశీస్సులతో జగ్గంపేట నియోజకవర్గ ప్రజలందరి విఘ్నాలు తొలగిపోవాలని ఆకాంక్షించారు. సూపర్ ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని, వినాయకుడి కృపతో మంచి వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో, ప్రాంతం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు, కూటమి నాయకులకు, కార్యకర్తలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ ఇంజనీర్ సత్తి సదాశివరెడ్డికి ఘన సన్మానం



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 15:** భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా జగ్గంపేటలో ప్రముఖ ఇంజనీర్ సత్తి సదాశివరెడ్డిని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తకొండ బాబు ఘనంగా సత్కరించి ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొత్తకొండ బాబు మాట్లాడుతూ ఇంజనీర్లే దేశానికి వెన్నెముక అని అన్నారు. ఒక కలను కాగితంపై డిజైన్ గా మార్చి, దానిని క్షేత్రంలో అద్భుతమైన కట్టడంగా నిలబెట్టే నైపుణ్యం ఇంజనీర్ల సొంతమని కొనియాడారు. ఇంజనీర్లందరికీ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

## పోషకాహారమే సంపూర్ణ ఆరోగ్యానికి పునాది

**పోషణ మాసం కార్యక్రమంలో ఆహార వైవిధ్యంపై అవగాహన**



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 15:** పోషకాహార లోపాలను అధిగమించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సమతుల్య ఆహారమే కీలకమని ఐసీడీఎస్ అధికారులు పేర్కొన్నారు. పోషణ మాసం సందర్భంగా కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోనిఆత్రేయపురం మండల వెలిచేరు ఎస్సీ ఏరియా అంగన్వాడీ కేంద్రంలోమంగళ వారం ఆహార వైవిధ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ ఎ. గజలక్ష్మి ఆదేశాల తో సూపర్వైజర్ కె. పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, తల్లులకు పోషకాహార ప్రాధాన్యతను వివరించారు. ధాన్యాలు, చిరుధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, విత్తనాలు, పాలు, గుడ్లు తదితర ఆహార పదార్థాలను నిత్య ఆహారంలో సమతుల్యంగా చేర్చుకోవడం ద్వారా శారీరక, మానసిక వికాసాన్ని మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. చిన్నారుల్లో పోషకాహార లోపం నివారణతో పాటు గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ఆహార పదార్థాల ప్రదర్శన ద్వారా వాటిలోని పోషక విలువలను వివరించి, తల్లులకు అవగాహన కల్పించారు. పీ.పీ.పీ. ×ం=ా కాల్స్ ద్వారా అందించే పోషణ సమాచారంపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎ. కనకదుర్గ, ర. సుజాత, ఎం. నాగలక్ష్మి, కె. నందిని లక్ష్మి, ఆశా వర్కర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# అంతా మాయం..!





- 3 పేజి తరువాయి

తాజాగా ఏడు యంత్రాలను సీజ్ చేసి కేసు నమోదు చేయడంతో ఈసారి చర్యలు ఎంతవరకు కొనసాగుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

**“అధికారులకు తెలియకుండానే ఇంత పెద్ద తవ్వకాలు సాధ్యమా?”**

రోజుల తరబడి భారీ యంత్రాలతో తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో పెద్ద సంఖ్యలో వాహనాలు మట్టి, గ్రావెల్ తరలిస్తుంటే సంబంధిత శాఖలకు సమాచారం లేకుండా ఉండటం ఎలా సాధ్యమన్నది స్థానికుల ప్రధాన ప్రశ్న. ఒకటి రెండు రోజులు జరిగే చిన్న స్థాయి అక్రమ తవ్వకాలు కాకుండా, విస్తృత స్థాయిలో భూభాగ స్వరూపమే మారేంతగా తవ్వకాలు జరిగాయని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో రెవెన్యూ, మైనింగ్, విజిలెన్స్, పోలీస్ తదితర శాఖలు సమన్వయంతో సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**గ్రామస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు..?**

ఈ వ్యవహారంలో కొందరు స్థానిక ప్రభావశీల వ్యక్తుల పాత్ర ఉందని, వారి అనుమతి లేకుండా అక్కడ పనులు జరగవన్న ప్రచారం గ్రామంలో ఉందని పలువురు చెబుతున్నారు.

అలాగే వివిధ స్థాయిల్లో “చేతులు తడుపుతున్నారనే” ఆరోపణలు ప్రజల మధ్య వినిపిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఇవి ప్రస్తుతం స్థానికుల ఆరోపణలు, ప్రచారంలో ఉన్న మాటలు మాత్రమే. వాటికి అధికారిక నిర్ధారణ లేదా సంబంధిత వ్యక్తులపై న్యాయపరమైన తుది నిర్ధారణ ఉన్నట్లు ఈ కథనం పేర్కొనడం లేదు. అందువల్ల ఈ ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది.

**ఒక్కరోజు సీజ్‌తో సమస్య పరిష్కారమవుతుందా?**

ఏడు ప్రొక్లైన్ యంత్రాలను సీజ్ చేయడం, కేసు నమోదు చేయడం స్వాగతించదగ్గ చర్యే అయినప్పటికీ.. అసలు ప్రశ్న అక్కడితో ముగియదు.

ఎంతకాలంగా తవ్వకాలు జరుగుతున్నాయి?
ఎంత మట్టి/గ్రావెల్ తవ్వారు?
ఎన్ని వాహనాల్లో తరలించారు?
ఎక్కడికి తరలించారు?
ఎవరికి విక్రయించారు?
అనుమతులు ఉంటే వాటి పరిధి ఎంత?
అనుమతులకు మించి తవ్వారా?
ప్రభుత్వానికి ఎంత ఆదాయం రావాల్సి ఉంది?
నిబంధనలు ఉల్లంఘిస్తే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

**ఈ ప్రశ్నలకు సమాధానాలు వెలుగులోకి రావాల్సి ఉంది.**

సమగ్ర సర్వే చేయాలి

226 ఎకరాలుగా పేర్కొంటున్న కొండ ప్రాంతాన్ని అధికారిక రికార్డులతో సరిపోల్చి ప్రస్తుత భౌగోళిక పరిస్థితిపై సర్వే నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. డ్రోన్ సర్వే లేదా అధికారిక భూ సర్వే ద్వారా గతంలో ఉన్న భూభాగం, ప్రస్తుతం ఉన్న పరిస్థితిని పోల్చితే తవ్వకాల పరిమాణంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అదేవిధంగా తవ్వకాల ప్రాంతం, అనుమతులు, రవాణా చేసిన మట్టి పరిమాణం, రవాణా పత్రాలు, వాహనాల వివరాలు, సీజ్ చేసిన యంత్రాల యాజమాన్యం తదితర అంశాలపై విచారణ జరిపితే అసలు వాస్తవాలు బయటపడతాయని గ్రామస్థులు అంటున్నారు.

## జగ్గంపేట డొక్కా సీతమ్మ క్యాంటీన్ లో అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 15**: జగ్గంపేట పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహించారు. ముందుగా డొక్కా సీతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించి క్యాంటీన్‌ను ప్రారంభించారు. అనంతరం సుమారు 500 మందికి ఉచితంగా భోజనం అందించారు. జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సేవా స్ఫూర్తితో ప్రతి మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తుమ్మలపల్లి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తన సొంత నిధులతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పేదలు, కూలీలు, వృద్ధులు, ప్రయాణికులు, ఆపదలో ఉన్న వారికి భోజనం అందించి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తున్నామని రమేష్ తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు తుమ్మలపల్లి రమేష్ స్వయంగా భోజనం వడ్డించారు. భోజనం చేస్తున్న వారితో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాదారపు వీరబాబు, కురుమల్ల నాగేశ్వరరావు, పాఠం శెట్టి రమేష్, పులి ప్రసాద్, గోకేడ ప్రసాద్, అడబాల వీరబాబు, గుంటముక్కల పెద్ద, పబ్బిరెడ్డి మణికంఠ, డ్రిల్ మాస్టారు, కోలమూరు బుజ్జి జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ ఎన్నికల ముసాయిదా జాబితా ప్రదర్శన



**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 15:** ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు-2026 నిర్వహణ నిమిత్తం ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాను మంగళవారం జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఏవిఎస్ చంద్రశేఖర్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 16వ తేదీ లోపు ఎంపీడీవో కార్యాలయంలో లిఖితపూర్వకంగా తెలియజేయాలన్నారు. ఎవరైనా అభ్యంతరాలు తెలిపితే వాటిపై చర్యలు తీసుకొని కలెక్టర్ ఆమోదంతో ఈనెల 19వ తేదీన తుది జాబితా ప్రదర్శించడం జరుగుతుందన్నారు. జగ్గంపేట మండలంలో ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి 75 పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో జగ్గంపేట పంచాయతీలో అత్యధికంగా 18 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. అత్యధికంగా మల్లిశాల పంచాయతీలోని 9వ నెంబర్ పోలింగ్ స్టేషన్ లో 1072 మంది ఓటర్లు ఉన్నారని, అత్యల్పంగా కాట్రావులపల్లి పంచాయతీలో 3వ నెంబర్ పోలింగ్ స్టేషన్లో 596 మంది ఓటర్లు ఉన్నారన్నారు. జగ్గంపేట మండలంలో మొత్తం 67202 మంది ఓటర్లు ఉండగా పురుషులు 32961, స్త్రీలు 34236, ఇతరుల 5 మంది ఉన్నారని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది, జగ్గంపేట పంచాయతీ అభివృద్ధి అధికారి శివ తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకటేశ్వర స్వామి సన్నిధిలో భక్తి వెల్లువ.. అన్నదానానికి ఉదార విరాళాలు





**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 15:** కోనసీమ తిరుమలగా ఖ్యాతిగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, స్వామివారి నిలువెత్తు రూపాన్ని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. స్వామివారి దర్శనం అనంతరం పలువురు భక్తులు ఆలయ సన్నిధిలో నిరంతరం కొనసాగుతున్న నిత్య అన్నదాన పథకానికి తమ వంతు సహకారంగా విరాళాలు అందజేశారు. రాజమహేంద్రవరానికి చెందిన మిస్ పరమల్ల లాస్విని నాగమణి కుటుంబ సభ్యులు రూ.72,530 నగదును అన్నదాన పథకానికి విరాళంగా సమర్పించారు. ఇదే సందర్భంలో గుంటూరు జిల్లాకు చెందిన గద్దె అజయ్ కుమార్, సత్యనారాయణ కుమారుడు, వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానానికి 403 గ్రాముల వెండి పళ్లెం సమర్పించారు. దీని విలువ సుమారు రూ.98,800 ఉంటుందని ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తులు సమర్పించిన విరాళాలు, కానుకలు ఆలయ ధార్మిక కార్యక్రమాలకు, నిత్య అన్నదాన పథకానికి మరింత బలాన్ని చేకూర్చేలా ఉన్నాయి. భక్తుల సేవాభావం ఆలయ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రజలకున్న అనుబంధాన్ని ప్రతిబింబిస్తోంది. ఈ సందర్భంగా దాతలను ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆశీర్వదించారు. అనంతరం ఆలయ అధికారి వెంకటరాజు , ప్రసాద్,స్వామివారి చిత్రపటాన్ని దాతలకు అందజేసి అభినందించారు. ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడికి ఆధ్యాత్మిక అనుభూతితో పాటు అన్నప్రసాదం అందించాలనే సంకల్పంతో నిత్య అన్నదాన కార్యక్రమం కొనసాగుతున్నట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి దర్శనానికి భక్తుల రాక రోజురోజుకూ పెరుగుతుండటంతో ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగుతున్నాయి.

## పసుపు అలంకరణ లోగణపతి

**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 15**:గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని స్వామివారికి పుసుపుతో ప్రత్యేక అలంకరణ చేసారు. కోఠీవారి అగ్రహారం వేంచేసియున్న శ్రీ భువనేశ్వరీ సమేత విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో గణపతి నవరాత్ర మహోత్సవాల సందర్భంగా రెండవ రోజు స్వామివారికి హరిద్ర (పసుపు) గణపతిగా విశేష అలంకరణ అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పూజాకార్యక్రమాలు అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందచేసారు.



# ఎంపీటీసీ ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

**అభ్యంతరాలు, సూచనలకు సెప్టెంబర్ 16 వరకు అవకాశం --- ఎంపీడీఓ హరికృష్ణ సత్యారెడ్డి**

**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 15:**మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ) రెండో సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా గండేపల్లి మండలంలోని 16 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను మంగళవారం ప్రచురించినట్లు ఎంపీడీఓ తెలిపారు.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ విజయవాడ వారు జారీ చేసిన నోటిఫికేషన్ నంబర్ 515/రాజుజ-దీ1/2026, తేదీ 07-09-2026 ప్రకారం ఈ ముసాయిదా జాబితాలను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ప్రజల పరిశీలనార్థం జాబితాలను గండేపల్లి మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాపై ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే సెప్టెంబర్ 16వ తేదీలోగా గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో లిఖితపూర్వకంగా సమర్పించాలని ఎంపీడీఓ కోరారు. అందిన అభ్యంతరాలు, సూచనలను పరిశీలించి తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.



# ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై లక్ష్యాలను గడువులోగా సాధించాలి





- శాఖల మధ్య సమన్వయంతో కాకినాడ జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి
- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నీటి వినియోగానికి ప్రాధాన్యతలు

**కాకినాడ, పెన్‌పవర్, సెప్టెంబర్ 15:**రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి శాఖకు నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా సాధించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి అన్ని రంగాల్లో కాకినాడ జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ఈ నెల 10న ముఖ్యమంత్రి చర్చించిన అభివృద్ధి, సంక్షేమ అంశాలపై అధికారులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. వ్యవసాయం,

### సాగునీటిపై ప్రత్యేక దృష్టి

వ్యవసాయ రంగంపై సమీక్షిస్తూ సేంద్రీయ, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు మైక్రో ఇరిగేషన్ ద్వారా సాగునీటి వినియోగ సామర్థ్యాన్ని గరిష్ఠ స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడా భూములు బీడుగా ఉండకుండా అన్నింటినీ సాగులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఫార్మర్ యాప్ వినియోగాన్ని 100 శాతం సంతృప్తి స్థాయికి తీసుకెళ్లాలని, పీఎండీఎస్ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మినుము, పెసర వంటి అపరాల సాగును ప్రోత్సహించి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా నీటి వినియోగానికి ప్రాధాన్యతలను ఖరారు చేయాలని తెలిపారు. మొదటి ప్రాధాన్యతగా తాగునీరు, రెండో ప్రాధాన్యతగా నిరంతర నీటి సరఫరా అవసరమైన పరిశ్రమలు, మూడో ప్రాధాన్యతగా పశువుల తాగునీరు, నాలుగో ప్రాధాన్యతగా మామిడి తదితర ఉద్యాన పంటలు, ఐదో ప్రాధాన్యతగా ఖరీఫ్, రబీ సాగుకు నీటిని వినియోగించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యత జలధార, జలహారతి కార్యక్రమాల ద్వారా నీటి వనరులను సంరక్షించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. వర్షాభావం కారణంగా వ్యవసాయ ఉత్పత్తులు తగ్గి ధరలు పెరిగే అవకాశం ఉన్నందున ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.
ప్రభుత్వ సేవల్లో అవినీతికి తావులేకుండా పూర్తి పారదర్శకత పాటించి 100 శాతం ప్రజా సంతృప్తి సాధించాలన్నారు. దీపం-2 పథకం కింద ప్రతిపాదిత మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను క్రమం తప్పకుండా లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్యాస్ డెలివరీ సిబ్బంది అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రాణనష్టం జరగకుండా రోడ్డు రవాణా వ్యవస్థను పటిష్టం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

### పరిశ్రమలు, ఉపాధికి ఊతం

ఉపాధి, పరిశ్రమలు, ఆర్థిక వృద్ధిపై సమీక్షిస్తూ భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ద్వారా జిల్లాకు ప్రతిపాదించిన తొమ్మిది ప్రాజెక్టుల్లో ఇప్పటికే నాలుగు మంజూరయ్యాయని, మిగిలిన ఐదు ప్రాజెక్టులు త్వరగా మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంఎఫ్ఎంఈ పథకాన్ని వేగవంతం చేసి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని తెలిపారు. అక్టోబర్ 12న ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించనున్న ప్రాంతీయ సమావేశానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కుల నిర్మాణం, ఎస్టీపీలకు భూసేకరణ, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటును వేగవంతం చేయాలని సూచించారు. ఆర్థిక, సామాజిక, గవర్నెన్స్ సూచీలపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లా వృద్ధి రేటుపై ప్రతి నెలా సమీక్ష నిర్వహించాలని తెలిపారు. అభివృద్ధి పనులను సమన్వయంతో చేపట్టి ప్రజలకు అవసరమైన వసతులను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

### గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

గృహ నిర్మాణం, పీఎంఏవై-గ్రామీణ్, టిడ్కో గృహ నిర్మాణాలను వేగవంతం చేసి లబ్ధిదారులకు త్వరగా సొంతింటి కలను సాకారం చేయాలని కలెక్టర్ సూచించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద చేపడుతున్న సింగిల్ విలేజ్, మల్టీ విలేజ్ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ఎస్టీపీ భూసేకరణ పనుల్లో పురోగతి సాధించాలని తెలిపారు. పాఠశాల విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ, పీఎం సేతు, మైనారిటీ సంక్షేమం, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణ పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. పౌల్ట్రీ రైతులతో వర్క్‌షాప్ సెప్టెంబర్ చివరి వారంలో లేదా అక్టోబర్ మొదటి వారంలో పౌల్ట్రీ రైతులతో వర్క్‌షాప్ నిర్వహించాలని పశుసంవర్ధక శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకర్లు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు, పౌల్ట్రీ రంగానికి సంబంధించిన వివిధ సంస్థలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్ఓ డా. డీ. తిప్పేనాయక్, జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు, డీఆర్‌డీఏ పీడీ జి. శ్రీనివాసరావు, డ్వామా పీడీ ఎస్. మధుసూదన్, సీపీఓ పి. త్రినాథ్, డీపీఓ వి. రవికుమార్, డీఎంహెచ్ఓ డా. కె. అనిత, జీఎండీఏసీ సీహెచ్. గణపతి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మహమ్మద్ అబ్దుల్ మతీన్, వ్యవసాయ శాఖ జేడీ వి.టి. రామారావు, ఎస్‌జీఎస్‌డబ్ల్యూ నోడల్ అధికారి జే. వేణుగోపాల్, ఏపీఎంఐపీ ఏడీ ప్రసాదరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ పి. రామకృష్ణారెడ్డి, డ్రైనేజీ ఈఈ ఎం.వి.వి. కిషోర్ తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# అయినవిల్లిలో వైభవంగా వినాయక చవితి వేడుకలు







### విఘ్నేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఎంపీ, ప్రభుత్వ విప్ దంపతులు

**అయినవిల్లి పెన్ పవర్ సెప్టెంబర్ 15:**వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన అయినవిల్లిలో భక్తి సందడి నెలకొంది. విఘ్నేశ్వర స్వామివారి దర్శనార్థం జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. వినాయక చవితి రోజున అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధురి అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు సంప్రదాయబద్ధమైన ఆలయ మర్యాదలతో ఎంపీకి స్వాగతం పలికారు. అనంతరం వినాయక చవితి రెండో రోజు ప్రభుత్వ విప్, ముమ్మడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించి దంపతులకు వేద ఆశీర్వచనం అందజేశారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ విళ్ళ సూర్యనారాయణ, ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు దాట్ల సుబ్బరాజు దంపతులను శేషవస్త్రాలతో ఘనంగా సత్కరించారు. వినాయక చవితి సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీ దృష్ట్యా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు దర్శనం, ప్రసాదాల స్వీకరణలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో అయినవిల్లి క్షేత్రం వినాయక చవితి పర్వదినాన భక్తజన సందోహంతో కిటకిటలాడింది.

# వినూత్న రీతిలో వినాయక నవరాత్రులు



**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 15:** ర్యాలి శక్తి గణపతి ఆలయంలో నవరాత్రుల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రోజుకో సేవా వినాయకుడి అలంకరణ చేస్తూ అందర్నీ ఆకట్టుకుంటున్నారు. వినాయక చవితి రోజున అన్నదాన వినాయకుడి పేరుతో అన్నదాన నిర్వహించడంతోపాటు రెండో రోజు నోరులేని జీవాలకు ఆహారం అందించడం కోసం జీవకారుణ్య వినాయకుని అలంకరణతో వరి కంకులు వివిధ ఆహారపు గింజలతో వినాయకుని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇలా తొమ్మిది రోజులు పర్యావరణ వినాయకుడు, కళా వినాయకుడు, సేవా వినాయకుడు, ఆరోగ్య వినాయకుడు, వస్త్రధాన వినాయకుడు వంటి అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించి వాటిని పేద ప్రజలకు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు లండన్ఫిజియోథెరపిస్ట్ మోహిత్ సీత లు అన్నపూర్ణ శ్యామ్ రుషితులు పాల్గొన్నారు.

# గణపతి నిమజ్జనాలలో డీజేలపై నిషేధం

- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఎస్ఐ నరేష్



**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 15:**వినాయక చవితి వేడుకలలో భాగంగా గణపతి నిమజ్జనోత్సవాల నేపథ్యంలో డీజే సౌండ్ బాక్సులను పూర్తిగా నిషేధించామని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జి. నరేష్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో ఆయన ఆధ్వర్యంలో మండల పరిధిలోని డీజే సౌండ్ బాక్సుల యజమానులతో మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ ఎలాంటి వేడుకలకైనా పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా డీజే సౌండ్ సిస్టమ్ లు ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేశారు. డీజేల నుంచి వచ్చే అధిక శబ్దం వల్ల వృద్ధులు, చిన్నారులు, గుండె జబ్బులు ఉన్నవారికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఇటీవల కాలంలో డీజే శబ్దాల వల్ల పలువురు గుండెపోటుకు గురవుతున్న ఘటనలు పెరుగుతున్నాయన్నారు. నిబంధనలను అతిక్రమించి ప్రవర్తిస్తే దానికి పూర్తి బాధ్యత డీజే యజమానులు, నిర్వాహకులదేనని ఆయన స్పష్టం చేశారు. నిమజ్జన ఊరేగింపుల్లో పాల్గొనే చిన్నారులను, యువకులను బాణసంచా వాహనాల్లో ఎక్కించడం, వేలాడటం చేయకూడదని సూచించారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మరీ ముఖ్యంగా డీజేలు పెట్టడం, అశ్లీల నృత్యాలు ప్రదర్శించడం, ఇతర మతాలను, వ్యక్తులను రెచ్చగొట్టే విధంగా పాటలు, అసభ్యకరమైన సౌండ్స్ పెట్టడం నిషేధమన్నారు. అలాంటి అసాంఘిక సంఘటనలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు నిర్ణీత డెసిబెల్స్ లోపే సౌండ్ ఉండాలని సూచించారు. వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్ఐ నరేష్ కోరారు.

# పెనికేరులో వ్యక్తి ఆత్మహత్య



**ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 15:**మద్యానికి బానిసైన వ్యక్తి ఉరి వేసుకుని మరణించిన ఘటన సోమవారం రాత్రి మండలంలోని పెనికేరులో జరిగింది. ఎస్సై జి నరేష్ తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని పెనికేరుకి చెందిన అల్లం శ్రీనివాస్ (56) మద్యానికి బానిసై ప్రతిరోజూ కుటుంబ సభ్యులను డబ్బుల కోసం వేధిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి కూడా డబ్బులు ఇవ్వకపోతే చనిపోతానని భార్య అనంత లక్ష్మిని బెదిరించాడు. అయితే ఇది ఎప్పుడు మామూలే అని భావించి ఆమె వినాయక ఆలయానికి వెళ్లింది. తిరిగి వచ్చి చూసేసరికి అతను ఉరి వేసుకుని కనిపించడంతో ఆమె పెద్దగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు వెంటనే వచ్చి ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు మృతుని భార్య అల్లం అనంతలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. దీంతో శ్రీనివాస్ మృతదేహాన్ని మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## లక్ష్మి గణపతి స్వామివారికి వెండి కిరీటం బహుకరణ



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 15:**వినాయక చవితి సందర్భంగా మాచవరం, జయంతినగర్ లో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో వినాయకునికి భక్తులు నేదునూరి రాజకుమార్ , సత్తాల నాగరాజు వినాయకునికి వెండి కిరీటమును అందచేసారు. ఆలయకమిటి ప్రెసిడెంట్ దేవాంగుల బాబీ, సెక్రెటరీ జల్లి జయ రామ్, శ్రీలక్ష్మి గణపతి ఆలయ కమిటీ చేతులమీదుగా బహుకరణగా అందచేశారు. ఈ సందర్భంగా ఆలయాల అభివృద్ధికి దాతల ముందుకు రావడం సంతోషమన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్.





**కిర్లంపూడి, పెన్ పవర్,సెప్టెంబర్ 15:**ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు.కిర్లంపూడి మండలం పాలెం గ్రామంలో జనసేన పార్టీ నాయకులు, మెగాయూత్ ఫోర్స్ జగ్గంపేట ఇంచార్జ్ పత్తి సురేష్ (పాలెం బాబి) ఆధ్వర్యంలో కాకినాడ మెడికవర్ హాస్పిటల్స్ వారి సహకారంతో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.పాలెం వినాయకుని గుడి వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరై ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను పరిశీలించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. శిబిరంలో బిపి,షుగర్, ఈసీజీ, ఈఎన్టీ, ఆర్థోపెడిక్, కార్డియాలజీ, జ్వరం, తలనొప్పి, స్త్రీలకు సంబంధించిన సమస్యలు, కిడ్నీ స్క్రీనింగ్, జనరల్ సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందించారు.
పాలెంతోపాటు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, మెగా యూత్ ఫోర్స్ సభ్యులు,కార్యకర్తలు, మెడికవర్ హాస్పిటల్స్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విఆర్ఏల న్యాయమైన డిమాండ్లను తక్షణమే ప్రభుత్వం అమలు చేయాలి.

-తహసీల్దార్ ఎం సూర్యప్రభకు సమ్మె నోటీసు ఇచ్చిన ప్రత్తిపాడు వీఆర్ఏల సంఘం నాయకులు.




**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, సెప్టెంబర్,15:** వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ప్రత్తిపాడు మండలం వి.ఆర్.ఏల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేయకపోతే సమ్మె చేస్తామని తహసీల్దార్, ఎం సూర్యప్రభకు వినతిపత్రంతో పాటు సమ్మె నోటీసు అందజేసారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ వీఆర్ఏల అందరికీ తెలంగాణ తరహాలో పే స్కేలు తక్షణమే అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వీఆర్ఏలు అందర్నీ వన్ టైం సెటిల్మెంట్ విఆర్ఎల్ గా నియమించాలని,అర్హులైన వీఆర్ఏలకు 70 శాతం పదోన్నతి కల్పించాలని, మరణించిన విఆర్ఏల కుటుంబాలలో వయసుతో సంబంధం లేకుండా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ కొమరగిరి కృష్ణ, కార్యదర్శి,మానూరి సత్తిబాబు, కోశాధికారి, మురా గంగరాజు, వైస్ ప్రెసిడెంట్ ఖండవిల్లి బాలరాజు, కార్యవర్గ సభ్యులు దాసు,బూరా సత్తిబాబు,కుళ్ల రామకృష్ణ, బూరా చినబాబు, చినప్పారావు,ఇండుగబిల్లి నాని,అనిల్,కుమార్ మండలంలోని పలు వీఆర్ఏలు పాల్గొన్నారు.

# కాజులూరులో 17న మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

**కాజులూరు, పెన్‌పవర్, సెప్టెంబర్ 15:** కాజులూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఈ నెల 17న గురువారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు.మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు మాత భారతి అధ్యక్షతన సమావేశం జరగనుంది. సమావేశానికి ఎం.పీ.టీ.సీ. సభ్యులు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని మండల పరిషత్ అధికారులు కోరారు. సమావేశంలో మండలానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించే అవకాశం ఉంది.




## పోషణతో ఆరోగ్యం.. అవగాహనతో ఆనందం




**కంద్రిగలో పోషణ్ మాసోత్సవం**

**కొత్తపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 15:**గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై అంగన్వాడీ కేంద్రాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ హిమశ్రీ సూచించారు. కొత్తపేట మండలం కంద్రిగ గ్రామంలో మంగళవారం పోషణ్ మాసోత్సవ కార్యక్రమాన్ని అంగన్వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.గర్భిణులు రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలు, కోడిగుడ్లు, పాలు, చేపలు, మాంసం వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని హిమశ్రీ సూచించారు. ముఖ్యంగా మునగాకులో అనేక రకాల విటమిన్లు, ఖనిజాలు, పోషకాలు ఉంటాయని, గర్భిణులు తమ ఆహారంలో మునగాకును చేర్చుకోవాలని తెలిపారు. సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల తల్లి ఆరోగ్యంగా ఉండటంతో పాటు శిశువు ఎదుగుదల కూడా మెరుగ్గా ఉంటుందని వివరించారు.అంగన్వాడీ కార్యకర్తలు గర్భిణులు, బాలింతల బరువులను పరిశీలించి, వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. చిన్నారుల ఎదుగుదలను పరిశీలించడం, వయస్సుకు అనుగుణంగా బరువు, ఎత్తు నమోదుచేయడం, పోషకాహార ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు వివరించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతం, ఇతర పోషకాహార పదార్థాల వినియోగంపై కూడా అవగాహన కల్పించారు. చిన్నారులకు పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటి అంశాలను వివరించారు.బాలింతలు శిశువుకు పుట్టిన వెంటనే ముర్రుపాలు అందించాలని, ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ఆరు నెలల అనంతరం వయస్సుకు తగిన అదనపు ఆహారాన్ని తల్లిపాలతో పాటు అందించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు బి. కనకదుర్గ, ఎం. రత్నకుమారి, సీహెచ్. దుర్గాభవాని, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితుడికి మంత్రి సుభాష్ ఆర్థిక సాయం



**రామచంద్రపురం, పెన్ పవర్,సెప్టెంబర్ 15:** ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి ఉదారతను చాటుకున్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందించారు.రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలానికి చెందిన పెద్దింశెట్టి వెంకటేష్ కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయన తల్లిదండ్రులు సూర్యనారాయణ, పద్మావతి వృద్ధాప్యంలో ఉండగా, వెంకటేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వెంకటేష్ అనారోగ్యంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని స్థానిక కూటమి నాయకుల ద్వారా మంత్రి సుభాష్ తెలుసుకున్నారు.విషయం తెలుసుకున్న వెంటనే స్పందించిన మంత్రి.. వెంకటేష్ కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందించి, అధైర్యపడకుండా చికిత్స తీసుకోవాలని సూచించారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం తన బాధ్యతని, కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.మంత్రి అందించిన ఆర్థిక సహాయం, భరోసా తమకు కొండంత ధైర్యాన్ని ఇచ్చాయని వెంకటేష్ కుటుంబ సభ్యులు తెలిపారు. కష్టకాలంలో మానవతా దృక్పథంతో అండగా నిలిచిన మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దొమ్మేటి వెంకటేష్, కంచి ఆశీర్వాదం, దొమ్మేటి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానంతో అమర కీర్తి.. డొక్కా సీతమ్మ



**విద్యా బాల మందిర్‌లో డొక్కా సీతమ్మ జయంతి వేడుకలు**

**కొత్తపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 15:**ఆంధ్రుల అన్నపూర్ణగా ఖ్యాతిగాంచిన డొక్కా సీతమ్మ జయంతి వేడుకలను కొత్తపేట విద్యా బాల మందిర్ హైస్కూల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రామోజు అనురాధ డొక్కా సీతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయడమే జీవిత పరమార్థంగా భావించి, నిరంతరం అన్నదానం చేసిన మహోన్నత వ్యక్తి డొక్కా సీతమ్మ అని కొనియాడారు. ఆమె సేవా తత్పరత, మానవతా విలువలు నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. రామచంద్రపురం--మండపేట ప్రాంతంలో 1841లో జన్మించిన సీతమ్మ తన జీవితకాలంలో వేలాది మందికి అన్నం పెట్టి 'ఆంధ్రుల అన్నపూర్ణ'గా ప్రసిద్ధి చెందారని తెలిపారు.డొక్కా సీతమ్మ సేవలను స్మరించుకుంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం'గా పేరు పెట్టడం ఆమె సేవలకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. విద్యార్థులు ఆమె జీవితం, సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నూకపేయి శివరత్నం, తెలుగు ఉపాధ్యాయులు శివకృష్ణ, కృష్ణ అనీల్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని డొక్కా సీతమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

## ఈ నెల 29న స్కూల్ మేనేజ్ మెంట్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల





**కిర్లంపూడి,పెన్ పవర్, సెప్టెంబర్,15:**2026--27 విద్యా సంవత్సరానికి స్కూల్ మేనేజ్ మెంట్ ఎన్నికలు ఈ నెల 29 న నిర్వహించేందుకు రాష్ట్ర సమగ్ర శిక్ష షెడ్యూల్ విడుదల చేసినట్లు మండల విద్యాశాఖ అధికారులు టి జోషఫ్, మక్కా చిన్నారావులు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయగా ఈ నెల 18 శుక్రవారం మధ్యాహ్నం 2:00 గంటలకు వరకు ఎన్నికల కోసం ఓటర్ లిస్ట్ పాఠశాల నోటిఫిస్ బోర్డుపై ప్రదర్శించడం జరుగుతుందన్నారు.25 న ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు: ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు/ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం. జరుగుతుందన్నారు.మధ్యాహ్నం 3:00 నుండి 4:00 వరకు: తుది ఓటర్ లిస్ట్ ఫైనల్ చేసి నోటీసు బోర్డుపై ప్రదర్శించడం జరుగుతుందన్నారు.
ఈ నెల 29 మంగళవారం ఉదయం 7:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఎస్ఎంసి సభ్యుల ఎన్నికలు, ఎస్ఎంసి పునర్నిర్మాణం జరుగుతుందన్నారు.మధ్యాహ్నం 1:30 గంటలకు
సభ్యుల ద్వారా ఛైర్పర్సన్, వైస్ ఛైర్పర్సన్ ఎన్నిక,మధ్యాహ్నం 2:00 గంటలకు ఎస్ఎంసి మెంబెర్స్ ,ఛైర్పర్సన్,వైస్ ఛైర్పర్సన్ లతో ప్రమాణ స్వీకారం,మధ్యాహ్నం 3:00 గంటల నుండి 3:30 వరకు ఎస్ఎంసి ప్రథమ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు.

# ముసాయిదా పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాల స్వీకరణ

**కాజులూరు, పెన్‌పవర్, సెప్టెంబర్ 15:**2వ సాధారణ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు--2026 సందర్భంగా కాజులూరు మండలానికి సంబంధించిన ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాను మంగళవారం ప్రచురించినట్లు మండల పరిషత్ అధికారి జె. రాంబాబు తెలిపారు.రాష్ట్ర ఎన్నికల సంఘం విజయవాడ జారీ చేసిన సర్క్యులర్ నంబర్ 533/ఎస్ఈసీ--బి1/2026, సెప్టెంబర్ 9 సూచనల మేరకు ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాను ప్రజలు, రాజకీయ పార్టీల పరిశీలనార్థం కాజులూరు తహశీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలు, కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ ముసాయిదా జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించేందుకు సెప్టెంబర్ 16న ఉదయం 11 గంటలకు కాజులూరు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కాజులూరు మండల పరిధిలోని నమోదిత రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా సమావేశానికి హాజరై ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాపై తమకు ఉన్న క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సంబంధిత ఆధారాలతో సమర్పించాలని ఎంపీడీఓ జె. రాంబాబు కోరారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# రామచంద్రపురంలో వైసీపీకి భారీ షాక్.. టీడీపీలో 140 మంది చేరిక





**రామచంద్రపురం, పెన్‌పవర్, సెప్టెంబర్ 15:**రామచంద్రపురం పట్టణంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. కొత్తూరు రోడ్డు, స్టీల్ వెల్‌పేట ప్రాంతానికి చెందిన నియోజకవర్గ వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ పాటి వరప్రసాద్, రెండో వార్డు వైసీపీ అధ్యక్షుడు నీలం శివశంకర్‌తో పాటు సుమారు 140 మంది వైసీపీ కార్యకర్తలు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో మంగళవారం టీడీపీలో చేరారు. వారికి మంత్రి సుభాష్ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ చేపడుతున్న అభివృద్ధి, ప్రజా సేవా కార్యక్రమాలపై నమ్మకంతోనే టీడీపీలో చేరుతున్నట్లు నూతనంగా పార్టీలో చేరిన వారు తెలిపారు. మంత్రి సుభాష్ ప్రభుత్వ పరంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారని వారు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజారంజక పాలన సాగిస్తోందన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరినీ కుటుంబ సభ్యులుగా భావించి కలుపుకొని ముందుకు సాగుతామని తెలిపారు. కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలు పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకుని టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రామచంద్రపురం నియోజకవర్గంలో రోజురోజుకూ టీడీపీకి ప్రజాదరణ పెరుగుతోందని మంత్రి సుభాష్ అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవల్లి శివ, వార్డు పెద్దలు దంగేటి భద్రరావు, దొమ్మలపాటి విజయలక్ష్మి రాజశేఖర్, కట్టా నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

### ఈ నెల 29న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు




**చింతూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 15:** చింతూరు మండలంలోని ప్రభుత్వ యాజమాన్యంలోని 103 పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైనట్లు మండల విద్యాశాఖ అధికారి జి. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని జిల్లా పరిషత్, ఎంపీపీ, జీపీఎస్, ఏహెచ్ఎస్, ఏపీఆర్ఎస్, కేజీబీవీ, ఈఎంఆర్ఎస్ పాఠశాలల్లో ఈ ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా ఈ నెల 18న ఓటర్ల జాబితా ప్రకటన, 25న అభ్యంతరాల స్వీకరణతో పాటు తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. 29న ఎన్నికల నిర్వహణ, అనంతరం ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఈఓ వెల్లడించారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## ఇంజినీర్లు దేశ ప్రగతికి మార్గదర్శకులు

### ఏపీ నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవి కిరణ్ శాస్త్రి



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 15:**దేశ అభివృద్ధి, సాంకేతిక పురోగతిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్) డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవి కిరణ్ శాస్త్రి తెలిపారు. మౌలిక వసతుల కల్పన నుంచి ఆధునిక సాంకేతిక ఆవిష్కరణల వరకు ఇంజినీర్లు అందిస్తున్న సేవలు దేశ ప్రగతికి ఎంతో దోహదపడుతున్నాయని కొనియాడారు. ఏపీ నిట్ లోని డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో సంస్థ ప్రాంగణంలోని పరిపాలనా భవనం వద్ద మంగళవారం ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ రవి కిరణ్ శాస్త్రి మాట్లాడుతూ దేశ నిర్మాణం, అభివృద్ధిలో ఇంజినీర్లు పోషిస్తున్న పాత్ర ఎంతో అమూల్యమైనదని కొనియాడారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆధునిక సాంకేతికత, స్థిరమైన అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో వినూత్న పరిష్కారాలను అందించాల్సిన బాధ్యత ఇంజినీర్లపై ఉందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఇంజినీర్లు నైపుణ్యాలను పెంపొందించుకుంటూ దేశ ప్రగతికి మరింతగా సేవలందించాలని సూచించారు. సమాజ అవసరాలను గుర్తించి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే సాంకేతిక పరిష్కారాలపై యువ ఇంజినీర్లు దృష్టి సారించాలని సూచించారు. భారతదేశపు ప్రముఖ ఇంజినీర్, దార్శనికుడు, రాజనీతిజ్ఞుడు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతినే ప్రతి ఏటా ఇంజినీర్స్ డే గా నిర్వహించుకోవటం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. విశ్వేశ్వరయ్య చూపిన క్రమశిక్షణ, నిబద్ధత,, దేశసేవా స్ఫూర్తిని నేటి ఇంజినీర్లు ఆదర్శంగా తీసుకుని మరింత మెరుగైన, సుస్థిరమైన, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని వివరించారు. డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ డాక్టర్ వి.సందీప్, ఆచార్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ కూర్మయ్య, డాక్టర్ రాముడు, డాక్టర్ గుర్రాల కిరణ్ కుమార్, డాక్టర్ శారదా ప్రసన్న మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణపురం గ్రామ రైతు సేవా కేంద్రం నందు పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు..




**పెన్ పవర్ ఉంగుటూరు సెప్టెంబర్ 15:**ఖరీఫ్ పంటకు సంబంధించి ప్రతీ ఒక్కరు పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు,పంట నమోదు యొక్క అవశ్యకతను గురించి తెలిపారు. అలాగే యూరియా కొరత అనేది లేదు అని రైతులందరూ కూడా అవసరం మేరకు మాత్రమే అంటే ఇప్పుడు వేసే కోటాకు మాత్రమే తీసుకోవాలని దొరకదేమో అని అపోహతో ముందస్తుకోట కూడా ఇప్పుడే తీసుకొని వెళ్లి దాచుకోవడం లాంటివి చేయకూడదని రైతులకు సూచనలు ఇచ్చారు. యూరియా కొరత అనేది లేదు మనకి సరిపడా నిల్వలు ఉన్నాయి అని తెలియజేశారు.

ప్రస్తుత పంటల గురించి అదే విధంగా పంటలు వచ్చే చీడపీడలు వాటి యాజమాన్య పద్ధతుల గురించి అదేవిధంగా రైతులకు మేలైన విత్తన వంగడాల గురించి ముందస్తు జాగ్రత్తలు విత్తనం ఎంపిక ద్వారా, విత్తన శుద్ధి ద్వారా తెగుళ్లు అరికట్టవచ్చు అని , సూడొమోనాస్, ట్రైకోడెర్మ వీరిడి వాడటం వల్ల తెగుళ్లు నివారించవచ్చని తెలియచేయడం జరిగింది. యాజమాన్య పద్ధతులు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు. ఖర్చు తగ్గించుకుని పంట పండించే విధానం గురించి . అలాగే ఈ పంట నమోదు ప్రక్రియ పూర్తయినందున ప్రతి రైతు వాళ్ళు వేసిన రకం. వాళ్ళ వివరాలు రైతు సేవా కేంద్రం వద్దకు వచ్చి వివరాలు చూసుకోవాల్సినిధిగా తెలియ చేయటం అయినదిఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల వ్యవసాయ అధికారి డా.ప్రవీణ్ కుమార్ వీ ఏ ఏలు రైతులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ - కార్పొరేట్ ఆసుపత్రు ల పర్యవేక్షణపై ప్రభుత్వం ప్రజా సంఘాన్ని ఏర్పాటు చేయాలి

**వైద్య పరీక్షలు, స్కానింగ్ ల ధరల పట్టిక ఏర్పాటు చేయాలి**

**రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేడా శ్రీనివాస్ డిమాండ్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 15:**రాష్ట్రంలో ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రులు రోగులను ఆర్థికంగా దోచుకుంటు న్నాయని, వాటిపై ప్రభుత్వ నియంత్రణ లేదని, డి ఎమ్ హెచ్ ఓ సేవలను పూర్తి గా ప్రక్షాళన చేయాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ డిమాండ్ చేసారు. అర్పిసి ప్రధాన కార్యాలయంలో జరిగిన వారాంతపు సమావేశానికి అర్పిసి సీనియర్ సెక్యులర్ దుడ్డే త్రినాద్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రైవేట్ - కార్పొరేట్ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవల పేరిట రోగుల కుటుంబాల నుండి లక్షలు ఫీజులు వసూలు చేస్తున్నారని వాపోయారు. అర్హత గల వైద్యుల స్థానంలో తక్కువ జీతలకు ఇంగ్లీష్ వైద్యానికి సంబంధం లేని ఇతర వైద్యులతో అత్యవసర వైద్య విభాగాలను నిర్వహిస్తు ప్రభుత్వాన్ని, ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అనుభవం, అర్హత లేని వైద్యుల నిర్లక్ష్యం, అసమర్ధత కారణంగా చిన్న, చిన్న అనారోగ్య సమస్యలకే రోగులు చనిపోతున్నా ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహారిస్తుందని విమర్శించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరిగే మరణాలను నిర్లక్ష్యపు హత్యలు గానే పరిగణించా లన్నారు. రోగులు మరణించినా సొమ్ము చెల్లించిన తరువాతనే శవాన్ని తీసుకెళ్లాల్సిన అమానవీయ కోణం వెంటాడుతుందని అవేదన వ్యక్తం చేసారు. రోగులు మరణిస్తే కట్టించుకున్న మొత్తం సొమ్మును మరణించిన వ్యక్తి కుటుంబానికి చెల్లించే విధంగా ప్రభుత్వం చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు .

**ఆసుపత్రుల్లో వైద్యుల వివరాలతో బోర్డు లు ఏర్పాటు చేయాలి...**

కొన్ని ఆసుపత్రుల్లో నకిలీ సర్టిఫికెట్స్ తో వైద్యులుగా కొనసాగుతున్నారనే ఆరోపణలున్నాయని, ఆర్థిక నష్టంతో పాటు ప్రాణాలకు రక్షణ లేదని విమర్శించారు. ఈ ఆసుపత్రులలో పెద్ద, పెద్ద వైద్య డిగ్రీలతో పేర్లు కనపడే వైద్యులు వైద్య సేవల్లో కనిపించరని ఆరోపించారు. ఆసుపత్రుల్లో వైద్యుల పేర్లు, విద్యార్హతలు, రిజిస్ట్రేషన్ నంబర్ల వివరాలతో బోర్డులను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.రోగులు ఒక ఆసుపత్రి వైద్యుల సూచనల తో వేలరూపాయలు ఖర్చు చేసి వైద్య పరీక్షలు చేయించు కున్నా రోగం నయం కాకపోతే వారు మరో వైద్యుల వద్దకు వెళ్ళటం సహజ మన్నారు. ముందు చేయించుకున్న వైద్య పరీక్షలను తర్వాత వైద్యులు కనీసం పరిగణించరని, తిరిగి కొత్తగా అవే వైద్య పరీక్షలు చేయించటం రోగులను దోచుకోవడమే పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేసారు. పైగా ఈ వైద్యులకు అనుసంధానంగా వున్న పరిక్షా కేంద్రాల్లోనే పరీక్షలు, స్కానింగ్ లు చేయించుకోవాలని, మరో చోట చేయించుకుంటే రోగులపై వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేయడం దారుణ మన్నారు. మందులు సైతం వైద్యుల సొంత మెడికల్ షాపుల్లోనే కొనుక్కోవాలని, రోగులను దోచుకుంటున్నారని పేర్కొన్నారు. ఒకే వైద్య పరీక్షకు, ఒకే స్కానింగ్ కు వేర్వేరు పరీక్షా కేంద్రల్లో, స్కానింగ్ సెంటర్ ల్లో వేర్వేరు ధరల దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. ఒకే వైద్య పరీక్షలకు, స్కానింగ్ లకు అన్ని కేంద్రాల వద్ద ఒకే ధర వుండే విధంగా ప్రభుత్వం ధరల పట్టికను అమలు చేయాలన్నారు. సామాన్యుడి సంపాదనలో 80 శాతం ఆసుపత్రులకు, వైద్యానికి దారాపోసే పరిస్థితులు నేటి పౌరులను వెంటాడు తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు.

**వైద్య , ఆరోగ్య శాఖ లో అవినీతి ప్రక్షాళన చేయాలి...**

జిల్లా కేంద్రంగా పని చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ప్రభుత్వ , ప్రైవేట్ , కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యలకు బానిసలుగా మారిపోయారని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనలను ఆసుపత్రులు అనుసరించకపోయినా వాటి నిర్వహణ అద్భుతంగా వున్నట్టు అధికారికంగా ధ్రువీకరించడం ఈ శాఖ ప్రత్యేకతని ఎద్దేవా చేసారు. వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేసే దిగువ నుండి ఉన్నత స్థాయి వరకు ఉద్యోగులు ప్రభుత్వ జీతభత్యాలతో పాటు ప్రవేటు ఆసుపత్రుల యాజమాన్యల నుండి రెండింతల మేర ముడుపులు తీసుకోవటమే ఈ శాఖ అవినీతి కి నిదర్శన మన్నారు. వైద్య , ఆరోగ్య శాఖ లో అవినీతి ప్రక్షాళన జరగాలన్నా , వైద్య పరీక్షలు, స్కానింగ్, మందుల దోపిడి అరికట్టాలన్నా, ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల పనితీరులో మెరుగైన సంస్కరణలు అమలు జరగాలన్నా , రోగులకు మంచి వైద్యం జరగాలన్నా ప్రభుత్వం అధికారికంగా ప్రజా సంఘాలను ఏర్పాటు చేయాలని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు .ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ లంక దుర్గా ప్రసాద్ , వర్ధనపు శరత్ కుమార్ , దోషి నిషాంత్ , గుడ్ల ప్రసాద్ , చల్లా సాంబశివరావు , బసా సోనియా, మట్టపర్తి తులసి, పందిరి మహేష్ , , కళ్ళకూరి రవి కుమార్ , దబ్బి రత్న కుమార్ తదితరులు పాల్గొన్నారు .

## బీసీ విద్యార్థులకు ఉచిత సివిల్ సర్వీసెస్ శిక్షణ

- ప్రముఖ శిక్షణా సంస్థల నుంచి ఆన్‌లైన్ టెండర్ల ఆహ్వానం
- ఈ నెల 17న టెండర్ల దాఖలుకు గడువు

**విజయవాడ/కాకినాడ, పెన్‌పవర్, సెప్టెంబర్ 15:**వెనుకబడిన తరగతుల (బీసీ) అభ్యర్థులకు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించేందుకు ప్రముఖ శిక్షణా సంస్థల నుంచి ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ సంచాలకులు డా. ఏ. మల్లికార్జున తెలిపారు.ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని బీసీ భవన్‌లో నిర్వహిస్తున్న 'ఏపీ స్టేట్ స్టడీ సర్కిల్' ద్వారా 2026--27 విద్యా సంవత్సరానికి సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ మూడో బ్యాచ్‌ను నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని ఆయన తెలిపారు.శిక్షణ నిర్వహణకు సంబంధించి అర్హత కలిగిన ప్రముఖ శిక్షణా సంస్థల నుంచి ఆన్‌లైన్ షార్ట్ టెండర్ నోటిఫికేషన్ ఇప్పటికే విడుదల చేసినట్లు వెల్లడించారు. టెండర్లు దాఖలు చేసేందుకు సెప్టెంబర్ 17 చివరి తేదీ అని తెలిపారు.టెండర్లకు సంబంధించి అక్టోబర్ 1న ప్రీ-బిడ్ సమావేశం, అక్టోబర్ 5న టెండర్ల పరిశీలన, ఖరారు ప్రక్రియ నిర్వహించనున్నట్లు డా. మల్లికార్జున పేర్కొన్నారు.టెండర్లకు సంబంధించిన పూర్తి వివరాలను లో పరిశీలించవచ్చని ఆయన తెలిపారు.

## సీసీఆర్‌సీ కార్డులతో కౌలు రైతులకు బహుళ ప్రయోజనాలు.

-పొలం పిలుస్తుంది' కార్యక్రమంలో ఏఓ,నాగం సుధామాధురి.




**కిర్లంపూడి,పెన్ పవర్, సెప్టెంబర్,15:** కౌలు రైతులు సి.సి.ఆర్.సి కార్డులు తీసుకోవడం ద్వారా సాగు పరంగా బహుళ ప్రయోజనాలు పొందవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి అన్నారు.కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాగం సుధామాధురి రైతులకు పంటల సాగు హక్కు పత్రం (సీసీఆర్‌సీ)పై అవగాహన కల్పించారు.కౌలుకు భూమి తీసుకుని సాగు చేస్తున్న రైతులందరూ గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా సీసీఆర్‌సీ కార్డులు పొందాలని సూచించారు.సీసీఆర్‌సీ కార్డు 11 నెలల కాలపరిమితి కలిగి ఉంటుందని తెలిపారు.ఈ కార్డు ద్వారా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ-పంట నమోదు,ఎరువుల పంపిణీ,పంటల బీమా,పంట నష్టపరిహారం,ధాన్యం కొనుగోలు వంటి సేవలను నేరుగా కౌలు రైతు పేరుతో పొందే అవకాశం ఉంటుందని వివరించారు.అనంతరం వరి పంటను పరిశీలించారు.ఎల్‌నినో ప్రభావంతో ఆకునల్లి పురుగు ఉధృతి కనిపిస్తోందని,నివారణకు ప్రొఫెనోఫాస్ 400 మిల్లీలీటర్లను ఎకరాకు పిచికారీ చేయాలని వ్యవసాయ అధికారిణి సుధామాధురి సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎన్ సీతారామమూర్తి,వీఏఏ సింహాద్రి,దొరబాబు,అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## బాణసంచా దుకాణంలో పోలీసుల తనిఖీలు

లైసెన్సులు, అనధికార బాణసంచాపై ఆరా



**రావులపాలెం, పెన్ పవర్ సెప్టెంబర్ 15:**వినాయక చవితి, దసరా తదితర పండుగల నేపథ్యంలో బాణసంచా దుకాణాల్లో నిబంధనల అమలుపై పోలీసులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా మంగళవారం రావులపాలెం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి. రమేష్ బాబు హైవే రోడ్‌లోని రావులపాడు వద్ద ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి బాణసంచా దుకాణాన్ని తనిఖీ చేశారు.దుకాణానికి సంబంధించిన లైసెన్సులు, అనుమతులు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశాలను పోలీసులు పరిశీలించారు. అలాగే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనధికార బాణసంచా నిల్వలు, విక్రయాలు జరుగుతున్నాయా అనే కోణంలోనూ తనిఖీలు నిర్వహించారు. బాణసంచా నిల్వ, విక్రయాల విషయంలో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఇన్స్పెక్టర్ జి. రమేష్ బాబుతో పాటు ఏఎస్ఐ పి. అమ్మిరాజు తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు. పండుగల సమయంలో ప్రజల భద్రతకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిబంధనలను కచ్చితంగా పాటించాలని పోలీసులు స్పష్టం చేశారు.

## దళితుల కోసం స్మశాన వాటిక స్థలం మంజూరు చేయాలి

- చింతూరు ఐటీడీఏ పీఓకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దళిత సంఘం వినతి



**చింతూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 15:**చింతూరు మండలంలోని దళిత కుటుంబాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దళిత సంఘం నాయకులు మంగళవారం చింతూరు ఐటీడీఏ పీఓను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ. గతంలో తమ దళిత కుటుంబాల్లో ఎవరైనా మృతి చెందితే చింతూరు శబరి ఒడ్డున అంత్యక్రియలు నిర్వహించి, అక్కడే సమాధి చేసేవారమని తెలిపారు. అయితే ఇటీవల శబరి నదిలో నీటి ప్రవాహం తీవ్రంగా ఉండటంతో ఒడ్డు కోతకు గురై, ప్రస్తుతం మృతదేహాలను పూడ్చిపెట్టేందుకు స్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత కుటుంబాల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని స్మశాన వాటిక కోసం తక్షణమే స్థలం మంజూరు చేయాలని ఐటీడీఏ పీఓను కోరారు. అలాగే దళిత కుటుంబాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పీఓ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు మెల్లం నాగేంద్రం, ప్రధాన కార్యదర్శి ఇంటి సుదర్శన్ కుమార్, సంఘ నాయకులు నక్క రజనీకుమార్, ప్రసంగి తదితరులు పాల్గొన్నారు.

# సచిన్ టెండూల్కర్ ప్రపంచ రికార్డును బ్రేక్ చేసిన జింబాబ్వే ఆటగాడు

- సచిన్ సుదీర్ఘ వన్డే కెరీర్ రికార్డును బద్దలు కొట్టిన బ్రెండన్ టేలర్
- ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో బరిలోకి దిగి ఈ ఘనత
- 22 ఏళ్ల 146 రోజుల కెరీర్‌తో ప్రపంచంలోనే తొలి ఆటగాడిగా గుర్తింపు
- 2027 ప్రపంచకప్ లక్ష్యంగా మళ్లీ జాతీయ జట్టుకు ఆడుతున్న టేలర్



**హైదరాబాద్ పెన్ పవర్:** జింబాబ్వే వెటరన్ వికెట్ కీపర్ బ్యాటర్ బ్రెండన్ టేలర్ అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న సుదీర్ఘ వన్డే కెరీర్ రికార్డును టేలర్ బద్దలు కొట్టాడు. నేడు హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో బరిలోకి దిగడం ద్వారా ఈ ఘనత సాధించాడు. తద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లో తన పునరాగమనాన్ని చిరస్మరణీయం చేసుకున్నాడు.2004లో వన్డే అరంగేట్రం చేసిన బ్రెండన్ టేలర్, తన కెరీర్‌ను 22 ఏళ్ల 146 రోజులకు విస్తరించాడు. దీంతో ప్రపంచంలోనే అత్యంత సుదీర్ఘకాలం వన్డేలు ఆడిన ఆటగాడిగా కొత్త చరిత్ర సృష్టించాడు. ఇప్పటివరకు ఈ రికార్డు సచిన్ టెండూల్కర్ (22 ఏళ్ల 91 రోజులు) పేరిట ఉండేది. టేలర్ కెరీర్ ఎన్నో ఎత్తుపల్లాలతో నిండి ఉంది. జింబాబ్వే తరఫున అత్యధిక పరుగులు చేసిన రెండో ఆటగాడిగా (6,704) కొనసాగుతున్న టేలర్, 2015 ప్రపంచకప్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికి ఇంగ్లండ్‌లో కోల్‌పాక్ ఒప్పందంపై ఆడాడు. రెండేళ్ల తర్వాత మళ్లీ జాతీయ జట్టులోకి తిరిగి వచ్చినా, 2021లో మరోసారి రిటైర్మెంట్ ప్రకటించాడు. ఆ తర్వాత 2019లో కొందరు బుకీలు తనకు కొకైన్ ఇచ్చి ద

బ్లాక్‌మెయిల్ చేయడానికి ప్రయత్నించారని, ఆ విషయాన్ని ఐసీసీకి చెప్పడంలో ఆలస్యం చేసినందుకు మూడున్నరేళ్ల నిషేధానికి గురయ్యానని వెల్లడించి సంచలనం సృష్టించాడు.ఈ నిషేధం తర్వాత కోచింగ్‌పై దృష్టి పెట్టాలనుకున్న టేలర్‌ను జింబాబ్వే క్రికెట్ ఎండీ గివ్‌మోర్ మకోనీ ఒప్పించాడు. 2027 ప్రపంచకప్‌ను లక్ష్యంగా చేసుకుని తిరిగి జట్టులోకి రావాలని ప్రోత్సహించాడు. అతని మాటలతో స్ఫూర్తి పొందిన టేలర్, గతేడాది తిరిగి జాతీయ జట్టులోకి వచ్చి ఇప్పుడు సచిన్ రికార్డును బద్దలు కొట్టి తన పేరును క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించుకున్నాడు.

# ఐసీసీ ర్యాంకింగ్స్ లో చరిత్ర సృష్టించిన శ్రీచరణి.. 800 పాయింట్లను టచ్ చేసిన తొలి భారత బౌలర్

- ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో చరిత్ర సృష్టించిన తెలుగు స్పిన్నర్ శ్రీచరణి
- 800 రేటింగ్ పాయింట్లు దాటిన తొలి భారత మహిళా క్రికెటర్‌గా రికార్డు
- మిథాలీ రాజ్ పేరిట ఉన్న 780 పాయింట్ల రికార్డును అధిగమించిన చరణి
- బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి దూసుకెళ్లిన దీప్తి శర్మ
- బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఆరో స్థానానికి చేరిన షఫాలీ వర్మ



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత మహిళా క్రికెట్‌లో యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీచరణి సరికొత్త చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తాజాగా విడుదల చేసిన టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో 800 రేటింగ్ పాయింట్ల మైలురాయిని దాటిన తొలి భారత బౌలర్‌గా ఈ తెలుగమ్మాయి అరుదైన ఘనతను అందుకుంది. మంగళవారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో ఆమె 804 పాయింట్లతో అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. ఇప్పటివరకు ఏ భారత మహిళా క్రికెటర్ (బ్యాటింగ్ లేదా బౌలింగ్) కూడా ఈ ఘనతను సాధించలేదు. 2011లో భారత దిగ్గజ క్రికెటర్ మిథాలీ రాజ్ నెలకొల్పిన 780 పాయింట్ల అత్యుత్తమ రేటింగ్‌ను శ్రీచరణి ఇప్పుడు అధిగమించింది.ఇటీవల ముగిసిన ఆసియా కప్ 2026 ఫైనల్‌లో శ్రీలంకపై శ్రీచరణి అద్భుత ప్రదర్శన కనబరిచిన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో కేవలం 20 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. టోర్నీ మొత్తం మీద 12 వికెట్లతో సత్తా చాటింది. ఈ ప్రదర్శనతో ఆమె రేటింగ్ పాయింట్లు భారీగా పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా మహిళల టీ20 క్రికెట్‌లో 800 పాయింట్ల మార్క్ దాటిన మూడో బౌలర్‌గా ఆమె నిలిచింది. గతంలో ఇంగ్లండ్‌కు చెందిన సోఫీ ఎక్లెస్టోన్ (802), ఆస్ట్రేలియా పేసర్ మేగన్ షట్ (806) మాత్రమే ఈ ఘనత సాధించారు. ప్రస్తుతం మేగన్ షట్ పేరిట ఉన్న ఆల్-టైమ్ రికార్డుకు శ్రీచరణి కేవలం రెండు పాయింట్ల దూరంలో ఉంది. అంతేకాకుండా, ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక టీ20 వికెట్లు తీసిన భారత బౌలర్‌గా పూనమ్ యాదవ్ రికార్డును కూడా చరణి ఈ ఏడాది అధిగమించడం విశేషం.మరోవైపు, భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ కూడా ర్యాంకింగ్స్‌లో సత్తా చాటింది. ఆసియా కప్‌లో 14 వికెట్లతో టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచిన దీప్తి, ఫైనల్‌లో 19 పరుగులకు 3 వికెట్లు తీసింది. ఈ ప్రదర్శనతో ఆమె నాలుగు స్థానాలు ఎగబాకి 729 పాయింట్లతో బౌలర్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకుంది.భారత్ రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి ఆసియా కప్ గెలవడంతో ఇతర క్రీడాకారిణుల ర్యాంకులు కూడా మెరుగయ్యాయి. ఫైనల్‌లో మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ (68) ఆడిన ఓపెనర్ షఫాలీ వర్మ, బ్యాటర్ల జాబితాలో ఒక స్థానం మెరుగుపరుచుకుని ఆరో ర్యాంకుకు చేరుకుంది. ఆల్‌రౌండర్ల జాబితాలోనూ ఐదు స్థానాలు ఎగబాకి 15వ స్థానంలో నిలిచింది.

# చెన్నై సూపర్ కింగ్స్ లో ధోనీ కొత్త అవతారం.. ఆటగాడిగా కాదు, కోచ్‌గా ఎంట్రీ? మాజీ సెలెక్టర్ బిగ్ కామెంట్స్!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) హెడ్ కోచ్ పదవి నుంచి స్టీఫెన్ ఫ్లెమింగ్ తప్పుకున్న తర్వాత, తదుపరి కోచ్ ఎవరనే దానిపై ఊహాగానాలు తారస్థాయికి చేరాయి. ఐదుసార్లు ఐపీఎల్ విజేతగా నిలిచిన సీఎస్‌కే కోచ్ రేసులో మాజీ క్రికెటర్ హేమాంగ్ బదానీ పేరు ప్రముఖంగా వినిపిస్తుండగా, భారత మాజీ చీఫ్ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాడు. సీఎస్‌కే లాంటి దిగ్గజ ఫ్రాంచైజీకి బదానీ కోచ్‌గా వ్యవహరించే అర్హత లేదని తెగేసి చెప్పాడు.

**ధోనీ ఉన్న చోట వేరే కోచ్ దేనికి:**

తన యూట్యూబ్ ఛానెల్‌లో శ్రీకాంత్ మాట్లాడుతూ.. హేమాంగ్ బదానీ సీఎస్‌కే హెడ్ కోచ్ అవ్వడానికి ఏమాత్రం వీల్లేదు. ఢిల్లీ క్యాపిటల్స్ (ఐజ)లో అతను సాధించింది ఏమీ లేదు.. అతని కోసం సీఎస్‌కే ఎందుకు ఎగబడాలో నాకైతే అర్థం కావడం లేదు.. అసలు ఎంఎస్ ధోనీ జట్టులో ఉన్నప్పుడు వేరే కోచ్ అవసరం ఏముంది? ధోనీ ఒక్కడే హెడ్ కోచ్ బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించగలడు అని సంచలన వ్యాఖ్యలు చేశాడు.

**ఇండియన్ కోచ్ కావాలంటే పండిత్ బెస్ట్:**

ఒకవేళ మహేంద్ర సింగ్ ధోనీ కచ్చితంగా భారతీయ కోచ్‌నే కోరుకుంటే, కేకేఆర్ మాజీ కోచ్ చంద్రకాంత్ పండిత్‌ను ఎంపిక చేసుకోవాలని శ్రీకాంత్ సూచించాడు. రంజీ, ఐపీఎల్ స్థాయిలో ట్రోఫీలు గెలిచిన అపార అనుభవం పండిత్‌కు ఉందన్నాడు. అంతర్జాతీయ స్థాయిలో గొప్ప ప్లేయర్ అయినవారికి లేదా డొమెస్టిక్, ఐపీఎల్‌లో అద్భుత రికార్డు ఉన్న కోచ్‌లకే సీఎస్‌కే బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేశాడు.

**తొందరపాటు వద్దు.. డిసెంబర్‌లో ఆక్షన్:**

డిసెంబర్‌లో మాత్రమే ఐపీఎల్ ఆక్షన్ జరగనుంది, కాబట్టి కొత్త కోచ్ ఎంపిక విషయంలో చెన్నై సూపర్ కింగ్స్ మేనేజ్‌మెంట్ తొందరపడాల్సిన అవసరం లేదని మాజీ చీఫ్ సెలెక్టర్ శ్రీకాంత్ సలహా ఇచ్చాడు. ప్రశాంతంగా ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించాడు. మరోవైపు డీసీ యాజమాన్యం జెఎస్‌డబ్ల్యూ హస్తగతమవుతుండటంతో సౌరవ్ గంగూలీ హెడ్ కోచ్‌గా, యువరాజ్ సింగ్ అసిస్టెంట్ కోచ్‌గా డీసీ బాధ్యతలు స్వీకరించడం దాదాపు ఖాయమైంది.

# పరిశ్రమను వెంటాడుతున్న పార్ట్-2 ఫ్లాప్ సెంటిమెంట్!

ప్రస్తుతం తమిళ సినీ పరిశ్రమను విచిత్రమైన భయం వెంటాడుతోంది. ఒకప్పుడు బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన బ్లాక్‌బస్టర్ సినిమాలకు సీక్వెల్స్ (పార్ట్-2) తెరకెక్కించడం అక్కడ ఓ ట్రెండ్‌గా మారినా? ఆ సీక్వెల్స్ సాధిస్తున్న ఫలితాలు మాత్రం మేకర్స్‌ను భయాందోళనకు గురిచేస్తున్నాయి. భారీ అంచనాల మధ్య వచ్చిన పార్ట్2 చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద దారుణంగా బోల్తా పడటంతో పరిశ్రమలో సీక్వెల్స్ ఫ్లాప్ సెంటిమెంట్ ఓ పెద్ద గండంలా తయారైంది.గతంలో వచ్చిన చిత్రాల ఘనవిజయాన్ని ఆధారంగా చేసుకుని తీసిన అనేక పార్ట్-2 సినిమాలు ప్రేక్షకులను తీవ్రంగా నిరాశపరిచాయి. శంకర్-కమల్ హాసన్ కాంబినేషన్‌లో ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత వచ్చిన -ఇండియన్ 2- బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. పి. వాసు-రాఘవ లారెన్స్ కాంబినేషన్ లో రిలీజ్ అయిన -చంద్రముఖి 2-, విక్రమ్ -సామి 2-, విశాల్ -పందెంకోడి 2- వంటి చిత్రాల ఫలితాలు తారుమారయ్యాయి. తాజాగా రిలీజ్ అయిన సర్దార్ 2 కూడా అంచనాలు అందుకోవడంలో విఫలమైంది. మొదటి భాగాలు సాధించిన విజయంలో సగం కూడా సాధించలేక డిజాస్టర్లుగా



ముగిసాయి.సీక్వెల్స్ వరుసగా పరాజయం పాలవ్వడానికి ప్రధాన కారణం మొదటి భాగం పెంచిన అంచనాలే అని విశ్లేషకులు భావిస్తున్నారు. మొదటి భాగంలో ఉన్న కథా బలం, భావోద్వేగాలు , వినోదం సీక్వెల్స్‌లో లోపించడమే ఫ్లాప్‌లకు కారణం. కేవలం బ్రాండ్ నేమ్‌ను, క్రేజ్‌ను మాత్రమే నమ్ముకుని స్క్రిప్ట్‌పై సరైన శ్రద్ధ పెట్టకపోవడం వల్ల ప్రేక్షకులు ఈ చిత్రాలను



నిర్దాక్షిణ్యంగా తిరస్కారించనే మాట బలంగా వినిపిస్తోంది. దీంతో నిర్మాతలు వందల కోట్ల నష్టపోయారు . ఈ ప్రతికూల పరిస్థితులు పార్ట్-2 ఫ్లాప్ సెంటిమెంట్ నడుమ తాజాగా కోలీవుడ్ అభిమానుల ఆశలన్నీ రాబోయే కొన్ని క్రేజీ సీక్వెల్స్‌పైనే నెలకొన్నాయి. సూపర్ స్టార్ రజనీకాంత్ - నెల్సన్ దిలీప్‌కుమార్ కలయికలో తెరకెక్కుతోన్న -జైలర్ 2-, లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో కార్తి హీరోగా తెరకెక్కనున్న -ఖైదీ 2-, లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ (రాజఖ)లో భాగంగా రానున్న కమల్ హాసన్ -విక్రమ్ 2- చిత్రాలపై భారీ అంచనాలున్నాయి.ఈ చిత్రాలు ఆ దర్శక, హీరోల ప్రతిష్టకే కాకుండా కోలీవుడ్‌లో సీక్వెల్స్‌పై పోయిన నమ్మకాన్ని పునరుద్ధరించడానికి కీలకంగా మారాయి. ముఖ్యంగా లోకేష్ కనగరాజ్ వంటి ప్రతిభావంతులైన దర్శకులు తెరకెక్కించే -ఖైదీ 2-, -విక్రమ్ 2- చిత్రాలు కంటెంట్ పరంగా పక్కాగా ఉంటాయని.. బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తాయని సినీ ప్రియులు బలంగా నమ్ముతున్నారు.ఏదేమైనా సీక్వెల్ తీయడం అనేది కత్తిమీద సాము లాంటిదని తమిళ పరిశ్రమ మరోసారి గ్రహించింది. ఈ ఫ్లాప్ సెంటిమెంట్‌ను చెరిపివేసి రాబోయే చిత్రాలు కోలీవుడ్ బాక్సాఫీస్‌కు మళ్లీ పూర్వ వైభవాన్ని తెచ్చిపెడతాయా? లేదా? అన్నది చూడాలి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com